జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 25 మార్చి 2026 | సంపుటి: 19 | సంచిక: 16 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

విశ్వావసు నామ సంవత్సరం , మాఘ మాసము , ఫల్గుణం, తిథి: ద్వాదశి - 20:45:45 వరకు నక్షత్రం: పునర్వసు - 09:35:50 వరకు కరణం: బవ - 09:38:55 వరకు, బాల: వ - 20:45:45 వరకు పక్షం: శుక్ల యోగం: సౌభాగ్య - 17:01:49 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## పీజీ వైద్యసీట్ల కౌన్సిలింగ్ పొడిగింపు అసాధ్యం

తేల్చిచెప్పిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ,మార్చి24(ప్రజాజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని పీజీ వైద్య విద్యార్థులకు, ముఖ్యంగా మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం ఎదురుచూస్తున్న వారికి సుప్రీంకోర్టు తీర్పు పెద్ద మిగతా1 2లో..

## ఎపిలో ఉగ్రలింకుల కలకలం

విజయవాడలో ముగ్గురు యువకుల అరెస్ట్

విజయవాడ,మార్చి24(ప్రజాజ్యోతి): ఏపీలో ఉగ్రలింకులు కలకలం రేపాయి. ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలున్నాయనే అనుమానంతో విజయవాడలో ముగ్గురు యువకులను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వించిపేటకు చెందిన ఇద్దరు 21 ఏళ్ల మిగతా 2లో..

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

- కోవిడ్ తరహా సంక్షోభం
- నేడు అఖిలపక్షంతో ప్రభుత్వం భేటీ?
- పరిస్థితులపై మోడీకి ట్రంప్ ఫోన్



న్యూఢిల్లీ,మార్చి24(ప్రజాజ్యోతి): పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల అంశంపై సమీక్ష నిర్వహించే నేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా అంశంపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించిన విషయం తెలిసిందే. సోమవారం లోక్‌సభలో, ఇవాళ రాజ్యసభలో ఆయన ప్రసంగించారు. ఇరాన్ సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు లోక్‌సభలో మోదీ అన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ధీటుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కోవిడ్‌ను ఎదుర్కొన్న రీతిలో మిగతా 2లో..

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

మోడీ, అమిత్ షా,జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక

ఢిల్లీ మెట్రో, అసెంబ్లీలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, మార్చి24(ప్రజాజ్యోతి): దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. మిగతా 12లో..

# బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బీఆర్ఎస్

ఏం తప్పు చేశామని అంతలా విమర్శలు

విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడం తప్పా

మహిళలను కోటీశ్వరులను చేయాలనుకోవడం తప్పా

బీమా పథకంలో ఆదుకోవాలనుకోవడం సరికాదా

- బడ్జెట్ ప్రతులు చించి ఎందుకు పారిపోయారు
- గతంలో అసెంబ్లీలో మాట్లాడే పరిస్థితి ఉండేదా
- బడ్జెట్‌పై చర్చలో బీఆర్ఎస్‌పై భట్టి చురకలు



హైదరాబాద్,మార్చి24(ప్రజాజ్యోతి): బడ్జెట్‌లో మేం ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడాన్ని కూడా ఓర్వలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా అని నిలదీశారు. కుటుంబంలో పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబ పరిస్థితి తలకిందులైపోతుంది. అలాంటి కుటుంబాలకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని బీమా కల్పించాం. సంక్షేమ మిగతా 2లో..

## త్వరలో 'సాదాబైనామా' పరిష్కారం

- కొనుగోలుదారు అఫిడవిట్ ఇస్తే సరిపోతుంది
- దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీఓ 76
- శాసన మండలిలో మాత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



హైదరాబాద్,మార్చి24(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, ఆనాటి బి.ఆర్.ఎస్. ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు. భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం మిగతా 2లో..

# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

- క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు
- క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ, ఎస్టీ హక్కులు ఉండవు
- హిందువుల, సిక్కు, బౌద్ధ మత్‌స్థులకే కుల హక్కులు
- ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ,మార్చి24(ప్రజాజ్యోతి): మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసులుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, మిగతా 2లో..

# జీవన్‌రెడ్డితో ఫలించని పీసీసీ చీఫ్ దౌత్యం

పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్

నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి

తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన

నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు



జగిత్యాల,మార్చి24(ప్రజాజ్యోతి): తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారం లోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి, సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు. మరి తనకెందుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆర్ఎస్ మిగతా 2లో..

## కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

మండిపడ్డ విపక్ష నేత రాహుల్



న్యూఢిల్లీ, మార్చి24(ప్రజాజ్యోతి): పశ్చిమాసియా ఉద్రిక్తతలను గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో మాట్లాడుతూ పరిస్థితి కోవిడ్ తరహాలా ఉందంటూ పేర్కొనడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపోయారా? అని ప్రశ్నించారు. పార్లమెంటు వెలుపల మీడియాతో రాహుల్ మంగళవారంనాడు మాట్లాడారు. 'పార్లమెంటులో మిగతా 2లో..

# గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

అసెంబ్లీ గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఆందోళన

- దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్
- వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది
- దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్,మార్చి24(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై మిగతా 2లో..




## కారుణ్యమరణంతో హరీష్ రాణా మృతి

సుప్రీం అనుమతితో చికిత్స నిలిపివేత

న్యూఢిల్లీ,మార్చి24(ప్రజాజ్యోతి): సుప్రీం కోర్టు ద్వారా కారుణ్య మరణానికి అనుమతి పొందిన హరీశ్ రాణా మృతిచెందాడు. సుమారు 13 ఏళ్లపాటు కోమాలో ఉండి జీవచ్ఛవంలా మారిన 32 ఏళ్ల హరీశ్ రాణా కారుణ్య మరణానికి సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల అనుమతిచ్చిన విషయం మిగతా 12లో..

## మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కే ప్రతిష్ట

గతంలోనే హైకమాండ్ హామీ ఇచ్చింది

మరోమారు మంత్రి పదవిపై రాజగోపాల్

హైదరాబాద్,మార్చి24(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ హైకమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హామీ ఇచ్చిందని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి గుర్తు చేశారు. తనకు పదవి ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ ప్రతిష్ట పెరుగుతుందని అన్నారు. మీడియాతో మిగతా 12లో..

# ఈవీ వాహనాలపై 20శాతం డిస్కౌంట్

పెద్ద ఎత్తున ఈవీ ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు

ముందుకు వచ్చిన మహీంద్రా, తదితర కంపెనీలు

తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




హైదరాబాద్,మార్చి24(ప్రజాజ్యోతి): హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై మిగతా 2లో..

# సంపాదకీయం

## సీట్లు పెరిగితే రాజకీయ పార్టీలకు పండగే !

రాజకీయ పార్టీలు కోరుకున్నట్లుగానేడిలీమిటేషన్‌కు రంగం సిద్ధం అవుతోంది. దీంతో పార్లమెంట్ సీట్లు, అసెంబ్లీ సీట్లు పెరగడం ద్వారా రాజకీయ పార్టీలకు బహుళ ప్రయోజనం కలుగనుంది. ఆయా పార్టీలకు మరికొందరు ఎంపిలు, ఎమ్మెల్యేలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పునర్విభజన జరితే బాగా ఆనందించేది రాజకీయ పార్టీలు తప్ప ప్రజలు కాదు. ఈ విభజన ద్వారా సీట్లు పెకిగితే ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రాజకీయ నాయకుల్లో రిజర్వేషన్లు పెట్టాలి. గతంలో ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారు మరోమారు ఆ పదవులకు అనర్హులుగా ప్రకటించాలి. ఈ బిల్లులో అలాటి ప్రతిపాదన ఏదైనా పెడితే మంచిది. కేవలం రెండు టర్మ్‌లే పదవి అన్న రూల్ రావాలి. కానీ ఈ చట్టం తెస్తున్నవారు, తేవాలని కోరుకుంటున్న వారంతా పదవులకు అతుక్కుపోయిన వారే. అందువల్ల ఇప్పట్లో ఇది సాధ్యం కాదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు పెరిగితే దేశం మీద మరింత ఆర్థిక భారం పడనుంది. వారి జీతభత్యాలు, పెన్షన్లు తడిసి మోపెడు అవుతాయి. ఇదంతా ప్రజలు కట్టే పన్నలనుంచే చెల్లిస్తారు. కనీసం ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లు లేకుండా చేసినా మంచిదే. రెండేసి పెనషన్లు ముందుగా ఎత్తేయాలి. అదికూడా చేస్తారని అనుకోవడానికి లేదు. దేశం ఏమయినా ఫర్వాలేదు..వీరికి జీతాలు, పెన్షన్లు రావాల్సిందే. అయితే మహిళా రిజర్వేషన్ల వల్ల వారి సీట్లు పెరగడం, వారి ప్ఆరతినిధ్యం పెరగడం ఒక్కటే ఆనందించదగ్గ విషయం. ఇకపోతే దేశంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను 2011 జనాభా లెక్కల ఆధారంగా జరిపించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే.. లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం కోటా కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కూడా 2011 జనాభా లెక్కల ఆధారంగా అమలు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఈ బిల్లుల ఆమోదం కోసం శని, ఆదివారాలు కూడా పార్లమెంట్ సమావేశాలు జరిపించాలని, అవసరమైతే సమావేశాలను ఏప్రిల్ 2 నుంచి మరో వారం వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపును వ్యతిరేకించడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ ఇప్పుడున్న నియోజకవర్గాల్లో 50 శాతం అదనంగా నియోజకవర్గాలు చేరే అవకాశాలున్నాయి. ఫలితంగా లోక్‌సభ సభ్యుల సంఖ్య 816కు చేరే అవకాశం ఉంది. 816 సీట్లయితే.. అందులో 273 సీట్లు మహిళలకు రిజర్వు అవుతాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. తెలంగాణలో లోక్‌సభ సీట్లు 25 లేదా 26కు, అసెంబ్లీ సీట్లు 178 లేదా 179కి పెరిగే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 25 నుంచి 37–38కి, అసెంబ్లీ సీట్లు 262–263కు పెరగొచ్చు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దీనిపై తెలుగుదేశం, బిజూ జనతాదళ్, వైసీపీ, శివసేన (యూబీటీ), మజ్లిస్ తదితర పార్టీలతో చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో డిలిమిటేషన్ కూడా ఉంది. తెలుగు రాష్ట్రాల రాజకీయ నేతలు ఎంతో కాలంగా డీలిమిటేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు అన్నీ కూడా 2029 సాధారణ ఎన్నికల నుండి అమలులోకి రానున్నాయి. ఈ పరిణామంతో ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయ పార్టీల్లో నూతనోత్సాహం నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. నాయకులు కూడా ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటారు. బిజెపి కూడా యా రాష్ట్రాల్లో సీట్లు పెరగాలని, తమ ప్రాతినిధ్యం కూడా పెరగాలని కోరుకుంటోంది. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘవాల్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా లోక్‌సభ మరియు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేలా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలు 543 నుండి 816కి పెరుగుతాయి. అన్ని రాష్టాల్లోని మొత్తం అసెంబ్లీ స్థానాలు 4,123 నుండి 6,185కి చేరుతాయి. ఇకప ఎపిలో ప్రస్తుతం ఉన్న 175 నుండి 263కి పెరుగుతాయి.ప్రస్తుతం ఉన్న 25 ఎంపి స్థానాలు 38కి పెరుగుతాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 నుండి 179కి పెరుగుతాయి. లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 17 నుండి 26కి పెరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజనకు 2011 లేదా 2027 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకునే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ పూర్తి కానుంది. ఆ నివేదిక రాగానే పునర్విభజన పనులను వేగవంతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పెంపులో అన్యాయం జరుగుతుందనే ఆందోళన ఉంది. అయితే, అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం సీట్లు పెంచడం ద్వారా ఈ వ్యత్యాసాన్ని తగ్గించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ ప్రతిపాదనపై ప్రతిపక్ష కాంగ్రెస్ మరియు ఇతర మిత్రపక్షాల స్పందన ఎలా ఉంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే పెంపుదల అందరూ కోరుకుంటున్నదే కనుక ఇందులో ఏకాభిప్రాయం తప్పకుండా వస్తుంది. మిగా విషయాల్లో కానరాదు.

## మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు



మొదటిపేజీ తరువాయి..

సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

## బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బీఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి..

పథకాల గురించి చెబుతుంటే.. వినడానికి బీఆర్ఎస్‌కు సమయం లేదా? క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కావాలని ఉద్యోగులు పదేళ్ల నుంచి అడుగుతూనే ఉన్నారు. గతంలో వారు మాట్లాడేందుకు కూడా భయపడే పరిస్థితి కల్పించారు. గతంలో నేను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదు. డిప్యూటీ సీఎం హోదాలో బడ్జెట్ ప్రవేశ పెడితే.. బడ్జెట్ పత్రాలు చించి సభ నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ సభ్యులు చెప్పిందే మేం వినాలి.. వినకపోతే మేం వెళ్లిపోతామంటున్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి అంటూ భట్టి చురకలంటించారు. రైతు భరోసా పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల స్కీమ్‌గా మార్చుకుంది. 2018లో ప్రజలు ఓట్లేసేందుకు క్యూలైన్‌లో ఉండగా.. రైతు భరోసా నిధులు జమచేశారు. మేం ఎప్పుడూ ఎన్నికల కోసం రైతు భరోసా నిధులు జమచేయలేదు. రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం. రైతులకు ఉచిత కరెంట్ పథకం పేటెంట్ హక్కు మాదే. వ్యవసాయాన్ని పండగలా చేసిందే కాంగ్రెస్. మా ప్రభుత్వం రాగానే రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసింది. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదన్నదే బీఆర్ఎస్ ఆలోచన అంటూ దుయ్యబట్టారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే మా లక్ష్యం అని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను, ఉద్యోగులను నిర్బంధించిన వారు.. ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బ్జడెట్‌ను వినే ఓపిక లేక సభ నుంచి వెళ్ళిపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు.

## త్వరలో 'సాదాబైనామా' పరిష్కారం

మొదటిపేజీ తరువాయి..

చూపించడం జరిగిందని, అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫ్డివిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడంవల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76 ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తును పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని అన్నారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్ ను ఇస్తామని, రాష్ట్రం లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చేలిపారు. ధరణి పోర్టల్ లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ–సేవ నిర్వాహకులతో కలిసి 3.99 కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు.

## ఈవీ వాహనాలపై 20శాతం డిస్కౌంట్

మొదటిపేజీ తరువాయి..

20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరు ఢిల్లీ లాగ హైదరాబాద్ కాలుష్యం కావద్దని ఉద్దేశ్యంతో ఈవీ పాలసీ తీసుకొచ్చిందన్నారు.

## జీవన్‌రెడ్డితో ఫలించని పీసీసీ చీఫ్ దౌత్యం

మొదటిపేజీ తరువాయి..

అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు.కాంగ్రెస్ పార్టీని వీడొద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర, 43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి. ఆయన మాకు తండ్రిలాంటివారు. రాజకీయాల్లో ఆయన సీనియర్ నేత. జీవన్‌రెడ్డిని కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను వదలుకోదలచుకోలేదు. పార్టీ వీడే అంశంలో పునరాలోచన చేయాలని కోరాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. 'జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

మొదటిపేజీ తరువాయి..

రాబోయే రోజులకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఇవాళ రాజ్యసభలో కూడా మోదీ ఈ అంశాలనే ప్రస్తావించారు. అన్ని వనరుల నుంచి గ్యాస్‌ను, క్రూడ్ ఆయిల్‌ను సమీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తీవ్ర ఎనర్జీ సంక్షోభం ఏర్పడిందని, ఆ సంక్షోభాన్ని తట్టుకునే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నామన్నారు. యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలని, హోర్ముజ్ జలసంధిని ఓపెన్ చేయాలని ఆయన కోరారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఒకవేళ పశ్చిమాసియా పరిస్థితులు సుదీర్ఘ కాలం కొనసాగితే అప్పుడు పరిస్థితులు భయానకంగా ఉంటాయన్నారు. భారత్ వద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ ఇంధనం ఉన్నట్లు చెప్పారు. రాబోయే రోజుల ఆ సంఖ్యను 65 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చనున్నట్లు తెలిపారు. ఇంధన నౌకల తయారీ ప్రాజెక్టు కోసం సుమారు 70 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులు, హోర్ముజ్ జలసంధి తెరిపించాల్సిన అవసరంపై ఇరువురు నేతలు చర్చించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడే ప్రధాని మోదీతో మాట్లాడారు.

## గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

మొదటిపేజీ తరువాయి..

ఆందోళన వ్యక్తం చేశారు. అవే ప్లకార్డులతో అసెంబ్లీకి బయల్దేరి వెళ్లారు. గ్యాస్ కొరత లేదని చెబుతూనే హోటళ్లు, చిరు వ్యాపారులకు వాణిజ్య సిలిండర్ల సరఫరాను నిలిపివేయడంపై బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరత కారణంగా సాధారణ ప్రజానీకంతో పాటు చిరు వ్యాపారులు, హోటల్ వ్యాపారంపై ఆధారపడిన లక్షలాది మంది ఉపాధికి తీవ్ర విఘాతం కలిగిందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సరఫరా సంక్షోభంపై ప్రజలకు నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. యుద్ధం ప్రారంభమయ్యాక ఎల్‌పీజీ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద చాంతాడంత లైన్లు కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. గ్యాస్ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు నమ్మబలుకు తోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రం ఆధీనంలో పెట్రోలియం శాఖ ఉందని.. తామేమీ చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం అంటోందని కేటీఆర్ అన్నారు. ఫ్యూచర్‌లో గ్యాస్ సిలిండర్ల సైజ్ తగ్గిస్తారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయిని తెలిపారు.

## ఎపిలో ఉగ్రలింకుల కలకలం

మొదటిపేజీ తరువాయి..

యువకులతో పాటు, భవానీపురానికి చెందిన 20 ఏళ్ల యువకుడిని అరెస్టు చేసి రహస్యంగా విచారిస్తున్నారు.దేశవ్యాప్తంగా ఉగ్రమూలాలపై కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు నిరంతర నిఘా పెట్టారు. ఇందులో భాగంగా సోషల్‌మీడియా కార్యకలాపాలపైనా దృష్టిసారించారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా పోస్టులు పెడుతున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ పోలీసులు.. వారి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, విదేశాల్లో ఉగ్రవాద చర్యలకు ఆకర్షితులై సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినట్లుగా ముగ్గురు యువకులు ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరిని రహస్యప్రదేశంలో విచారిస్తున్నారు. వీరికి ఏ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయి? వీరిని ఉగ్రవాదం వైపు ఎవరు ప్రేరేపిస్తున్నారు? వీరికి సోషల్‌మీడియా లింకులు ఎలా వస్తున్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడ టెర్రర్‌కు హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్ర కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు హైదరాబాద్‌కు చెందిన మహిళతో సంబంధాలు ఉన్నట్లుగా సమాచారం. ఆ మహిళే కీలక సూత్రధారి అని పోలీసులు భావిస్తున్నారు. విజయవాడలో ముగ్గురు అనుమానితుల్ని అరెస్టు చేసిన వెంటనే.. ఆమె పరారవ్వడం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది.

## పీజీ వైద్యసీట్ల కౌన్సిలింగ్ పొడిగింపు అసాధ్యం

మొదటిపేజీ తరువాయి..

షాక్‌గా మారింది. పీజీ వైద్య సీట్ల భర్తీకి సంబంధించి కౌన్సెలింగ్ గడువును పొడిగించే ప్రసక్తే లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిపోయిన పీజీ వైద్య సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ గడువును పొడిగించాలని దాఖలైన పిటిషన్లను జస్టిస్ పీఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. నేషనల్ మెడికల్ కమిషన్ వాదనలతో ఏకీభవిస్తూ కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఏడు రౌండ్ల కౌన్సెలింగ్ నిర్వహించామని, ఇంతకంటే ఎక్కువ రౌండ్లు నిర్వహించడం సాధ్యం కాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. కౌన్సెలింగ్ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తే విద్యా క్యాలెండర్ దెబ్బతింటుందని, ఇది వైద్య విద్య నాణ్యతపై ప్రభావం చూపుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రతి సంవత్సరం కొన్ని సీట్లు మిగిలిపోవడం సహజమేనని, ముఖ్యంగా ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అధిక ఫీజుల కారణంగా సీట్లు మిగిలిపోతాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఎన్ఎంసీ తన నివేదికను సమర్పిస్తూ కౌన్సెలింగ్ పొడిగింపును తీవ్రంగా వ్యతిరేకించింది. మిగిలిపోయిన సీట్లలో అత్యధికం ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు చెందినవేనని, ప్రభుత్వ సీట్లు దాదాపు భర్తీ అయ్యాయని వివరించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం, నిర్దేశించిన తేదీ దాటిన తర్వాత అడ్మిషన్లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో సీటు వస్తుందని ఆశపడిన వందలాది మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరానికి అవకాశం కోల్పోయారు.

## కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

మొదటిపేజీ తరువాయి..



ఆయన నిన్న సందర్భోచితం కాని మాటలు మాట్లాడారు. కరోనా మహమ్మారితో ప్రస్తుత సందర్భాన్ని పోల్చారు. ఎల్పీజీ, పెట్రోల్ ధరల్లో ఇప్పుడే పెరుగుదల మొదలైంది. ఇంతలోనే పరిస్థితిని కరోనా మహమ్మారి రోజులతో ఆయన పోలుస్తున్నారు. కరోనా విరుచుకుపడిన సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపోయినట్టున్నారు' అని రాహుల్ అన్నారు. దేశ విదేశాంగ విధానంపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, దేశ విదేశాంగ విధానం మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారిందని, అంతర్జాతీయంగా ఇదొక హాస్యాస్పద అంశంగా మారిందని అన్నారు. 'మోదీ రాజీపడితే మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్టే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ రాజీకొచ్చినట్టే కనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు. మధ్యఆసియాలో పరిణామాలపై ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అఖిలపక్ష సమావేశంపై అడిగినప్పుడు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినా సరిదిద్దుకోలేని నిర్మాణాత్మక తప్పిదం జరిగిందని అన్నారు. అమెరికా ఏది చెబితే ఆది మోదీ చేస్తారని, రైతులు, దేశ ప్రయోజనాల కోసం పనిచేయరని విమర్శించారు. కేరళలో తనకు ప్రోగ్రాం ఉన్నందున అఖిల పక్ష సమావేశానికి హాజరుకాకపోవచ్చని చెప్పారు.

## మండలంలో డిపిఓ ఆకస్మిక తనిఖీ రికార్డుల పరిశీలన







**నేరడిగొండ, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** ఆదిలాబాద్ జిల్లా పంచాయతీ అధికారి డిపిఓ రమేష్ మంగళవారం నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామంలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మండల పరిషత్ అధికారి ఎం పి ఓ శ్యాంసుందర్ రెడ్డితో కలిసి గ్రామాన్ని సందర్శించిన ఆయన, పంచాయతీ కార్యాలయంలోని పలు కీలక రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా గ్రామపంచాయతీకి సంబంధించిన ఇంటి పన్ను వసూళ్ల వివరాలు, మల్టీ పర్పస్ వర్కర్ల రిజిస్టర్లు, మరియు ఇతర నిర్వహణ రికార్డులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. పన్నుల వసూళ్లలో పురోగతి ఉండాలని, 100% ఇంటి పన్ను వసూలు చేయాలని, గ్రామ అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలని ఆయన ఆదేశించారు. అనంతరం గ్రామంలో గల ఇందిరమ్మ ఇండ్లను, చేతిపంపులను, డ్రైనేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడి పురవి, పంచాయతీ కార్యదర్శి దత్త హరి, కారోబార్ రాజు, వార్డు సభ్యులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల హక్కు

- నెలకు 10 వేల పెన్షన్ వెంటనే అమలు చేయాలి
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ




**మంచిర్యాల, 24, మార్చి (ప్రజా జ్యోతి) :** సింగరేణి కార్మికుల సంక్షేమంపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ స్పందిస్తూ పార్లమెంట్లో కీలక వ్యాఖ్యలు చేశారు. సంవత్సరాల పాటు గనుల్లో కష్టపడి పనిచేసిన కార్మికులకు రిటైర్మెంట్ అనంతరం గౌరవప్రదమైన జీవితం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.రిటైర్ అయిన సింగరేణి కార్మికులకు నెలకు కనీసం 10 వేల పెన్షన్ ను అందించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. "సింగరేణి కార్మికులు తమ జీవితాన్ని గనుల్లో కష్టపడి దేశానికి అంకితం చేశారు. అలాంటి వారికి రిటైర్మెంట్ తర్వాత కనీస భద్రత లేకపోవడం బాధాకరం. కనీసం 10 వేల పెన్షన్ ఇవ్వడం వారి హక్కు" అని అన్నారు. ఈ అంశంపై పలుమార్లు ప్రభుత్వానికి ప్రాతినిధ్యాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. కార్మికుల కష్టాన్ని గుర్తించి వారికి తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. చివరగా, "సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్‌ను వెంటనే అమలు చేయాలి. లేకపోతే వారి హక్కుల కోసం పోరాటం మరింత ఉధృతం అవుతుంది ఎంపీ గడ్డం వంశీ కృష్ణ హెచ్చరించారు.

## బీసీ ఉద్యమ నాయకురాలు పేరం అలేఖ్యకు ఘన సన్మానం



**మంచిర్యాల, 24, మార్చి (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్‌లో బీసీ ఉద్యమ నాయకురాలు, హైకోర్టు న్యాయవాది పేరం అలేఖ్యకు మంగళవారం ఘన సన్మానం నిర్వహించారు. ఇటీవల హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా ఆమెకు లభించిన "మహిళ లెజెండరీ జాతీయ అవార్డు"ను పురస్కరించుకుని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ, పేరం అలేఖ్య అనేక సంవత్సరాలుగా మహిళల హక్కులు, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ఆమెకు జాతీయ స్థాయి అవార్డు రావడం మంచిర్యాల జిల్లాకు గర్వకారణమన్నారు. మహిళలు పేరం అలేఖ్యను స్ఫూర్తిగా తీసుకుని విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో ముందుకు రావాలని, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ఉపకోటా కోసం ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే పేరం అలేఖ్య భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకుని మరింత పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్‌తో పాటు వేముల అశోక్, రాజన్న చారి, మంచిర్యాల సదానందం, కొట్టే నటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లకు అవగాహన, భద్రతకు ప్రాధాన్యం

- నిద్రమత్తులో డ్రైవింగ్‌పై బీమారం పోలీసుల ప్రత్యేక చర్యలు





**మంచిర్యాల, 24, మార్చి (ప్రజా జ్యోతి) :** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల జోన్ పరిధిలోని బీమారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో రాత్రి వేళల్లో నిద్రమత్తులో డ్రైవింగ్‌పై ప్రత్యేక చర్యలు చేపట్టారు.రాత్రి సమయంలో నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమా దాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, పోలీసులు ప్రత్యేక పహారా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిద్రమత్తులో వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను గుర్తించి, వారికి తక్షణమే విశ్రాంతి కల్పించే చర్యలు తీసుకుంటున్నారు. డ్రైవర్లకు ముఖం కడగించి, టీ తాగించేలా చేసి, కొంతసేపు వారితో మాట్లాడి నిద్రమత్తు తగ్గేలా చేయడం జరుగుతోంది. అనంతరం మాత్రమే ప్రయాణం కొనసాగించాలని సూచిస్తున్నారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, అలసటగా ఉన్నప్పుడు వాహనం నడపకూడదని, అవసరమైతే తప్పనిసరిగా విరామం తీసుకోవాలని సూచిస్తున్నారు.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రధాన లక్ష్యంగా పోలీసులు కృషి చేస్తున్నారు. రాత్రి సమయంలో డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, పోలీసులకు సహకరించాలని ఎస్ఐ రాజేందర్ విజ్ఞప్తి చేశారు.

### రైతు భరోసా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమే

## నిధుల విడుదలపై ఖానాపూర్‌లో పాలాభిషేకం



**ఖానాపూర్ మార్చ్ 24 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్రంలో రైతుకు భరోసాగా కాంగ్రెస్ ప్రజాప్రతితం అండగా ఉంటుందని ఈ మేరకే రైతుల ఖాతాల్లో భరోసా నిధులను వేసి నిదర్శనం కాలేదు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పార్టీ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు రైతులు స్థానిక తెలంగాణ చౌక్ లో మంగళవారం పాలాభిషేకం చేశారు నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు "ప్రజా పాలన -- ప్రజా ప్రభుత్వం" నినాదంతో ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా నిధుల విడుదలను స్వాగతిస్తూ పాలాభిషేకం కార్యక్రమం చేపట్టాలని మండల పార్టీ అధ్యక్షుడు దొనికెని దయానంద్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వర్ రావు, ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ లకు కృతజ్ఞతలు తెలుపుతూ కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయం అని పేర్కొన్నారు. రైతు భరోసా ద్వారా రైతులకు ఆర్థిక భద్రత కలుగుతుందని, ఈ పథకం రైతుల జీవితాల్లో మార్పు తీసుకురాగలదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజుర సత్యం నిమ్మలరమేష్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మా జీద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం



### "క్షయ రహిత భారత్" దిశగా అడుగులు

**నేరడిగొండ, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** నేరడిగొండ మండల కేంద్రం లోని మండల పరిషత్ కార్యాలయం ఎంపీడీఓ ఆఫీస్‌లో మంగళవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "క్షయ రహిత భారత్" (టీబీ ముక్త్ భారత్ అభియాన్) లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అధికారులు టీబీ నివారణపై పలు కీలక సూచనలు చేశారు. ఎం.పి.డి.ఓ. శేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ సి.హెచ్. శేఖర్ మాట్లాడుతూ, క్షయ వ్యాధి పట్ల ప్రజలు ప్రాథమిక దశలోనే అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు మరియు మందుల గురించి వివరిస్తూ, వ్యాధి లక్షణాలు ఉన్నవారు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. అనంతరం హెచ్.ఈ.ఓ. పవార్ రవీందర్ మరియు హెల్త్ సూపర్వైజర్ సంతోష్ మాట్లాడుతూ, క్షయ వ్యాధి ప్రాణాంతకమైనది కాదని, సరైన సమయంలో చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. అందరం కలిసికట్టుగా కృషి చేసి భారత్‌ను టీబీ రహిత దేశంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి (ఎంపిఓ) శ్యామ్ సుందర్ రెడ్డి, ఆరోగ్య శాఖ సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### భారతదేశంలోనే ముస్లింలకు

## స్వేచ్ఛ దాన్ని కాపాడుకుంటూ జీవించాలి







- రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ
- ఖానాపూర్‌లో ఘనంగా వీర హనుమాన్ విజయ యాత్ర
- కాషాయ వనంగా, రామ నామంతో మారిన పురవీధులు

**ఖానాపూర్, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** ప్రపంచ దేశాల్లో భారత దేశం లోనే ముస్లింలకు అత్యంత స్వేచ్ఛ కలిగి ఉందని దాన్ని కాపాడుకుంటూ జీవించాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో వీర హనుమాన్ విజయ యాత్ర మంగళవారం భజరంగ్ దళ్ ఖానాపూర్ శాఖ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కొనసాగింది. పట్టణంలోని పలు వీదుల గుండా యాత్ర పాటలు పడుతూ, నృత్యాలు చేస్తూ భక్తి ప్రపత్తులతో కొనసాగింది. దీంతో ఖానాపూర్ పురవీధులంతా కాషాయ వనంల మారి రామనామ స్మరణతో మార్మోగింది వీర హనుమాన్ విజయ యాత్ర ఎన్టీఆర్ చౌక్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ, అఖిల భారతీయ మందిర ప్రబంధక్ పరిషత్ అధ్యక్షులు ముసపేట రామరాజు లు మాట్లాడారు. హిందువులు ఐక్యంతో హిందుత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. కొందరు అణిచివేచేందుకు ప్రయత్నం చేస్తున్నారని దాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత ప్రతి హిందూ పై ఉందని అన్నారు. ఏ దేశంలో లేని స్వేచ్ఛ భారత దేశంలో ముస్లిం లకు ఉన్నదని, ఈ విషయం వారు గుర్తించాలని పేర్కొన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడటానికి అందరు బాధ్యయుతంగా ఉండాలని, అన్ని దేశాల్లో యుద్ధ వాతావరణం ఉంటే మన దేశంలో ప్రశాంతత ఉందని, మోదీ దేశానికి రక్షణ కవచముల ఉన్నారని అన్నారు. అనంతరం వీర హనుమాన్ విజయ యాత్ర ఎన్టీఆర్ చౌరస్తా నుండి పుర వీధిలగుండా శ్రీరామ్ నగర్ హనుమాన్ ఆలయం వరకు భారీ ర్యాలీ గా కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్, హిందూ ఉత్సవ సమితి వ్యవస్థాపకులు అల్లాడి వెంకటేశ్వర్లు బిసి రాజన్న బొప్పరపు సత్యవతి ఎన్ఆర్ఐ గుండేటి గణేష్, భజరంగ్ దళ్ శాఖ కార్యకర్తలు కాసావేణి ప్రణయ్, అంకం మహేందర్, పడాల రాజశేఖర్, హనుమాన్ దీక్ష స్వాములు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా సామరస్యంతో సమస్యల ముగింపు

- రాజీ మార్గంలో వివాదాల పరిష్కారం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, 24, మార్చి (ప్రజా జ్యోతి) :** లోక్ అదాలత్ ద్వారా సామరస్యంతో సమస్యల ముగింపు సాధ్యమవు తుందని, రాజీ మార్గంలో వివాదాలకు పరిష్కారం లభిస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ నెల 28వ తేదీ శనివారం నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిపి పిలుపునిచ్చారు. లోక్ అదాలత్ వేదికగా వివాదాలు శాంతియుతంగా, వేగంగా పరిష్కారమవు తాయన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ మరియు వైవాహిక సమస్యలు, బ్యాంకు బకాయిల వసూలు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి వివిధ కేసుల్లో ఇరువర్గాలు చర్చించుకుని రాజీకి రావచ్చుని వివరించారు. "రాజీయే రాజమార్గం" అని పేర్కొన్న సీపీ, చిన్న చిన్న తగాదాల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేయవద్దని సూచించారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఇరుపక్షాలు శాంతియుత పరిష్కారం పొందాలని కోరారు. మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలోని పోలీస్ అధికారులు రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరు వర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. తమ కేసుల్లో రాజీ కావాలని కోరుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారమై బాధితులకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. ప్రజలకు సూచనలు: ఇరుపక్షాల సమ్మతితో మాత్రమే రాజీ సాధ్యం. లోక్ అదాలత్‌లో జరిగిన రాజీ చట్టపరంగా తుది తీర్పుగా పరిగణించబడుతుంది. న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల సమన్వయంతో పరిష్కారం జరుగుతుంద ని వివరించారు. "ప్రజలు, పోలీసులు, న్యాయస్థానాలు కలిసికట్టుగా పనిచేస్తే చిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా ముందే పరిష్కరించవచ్చు" అని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు.

## షహీద్ భగత్ సింగ్ వారసత్వం కొనసాగించాలి



**మంచిర్యాల, 24, మార్చి (ప్రజా జ్యోతి) :** భరతమాత దాస్య విముక్తి కోసం పోరాడి త్యాగం చేసిన షహీద్ భగత్ సింగ్ స్ఫూర్తితో దేశ ప్రజలు సమస్యల సాధన కోసం ఉద్యమించాలని వివిధ సంఘాల నేతలు పిలుపు నిచ్చారు.షహీద్ భగత్ సింగ్ రాజ్ గురు సుఖ్ దేవుల 95వ అమరత్వ దినం సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కుల మత సంకుచిత ధోరణులను అధిగమించి ఆ నాటి వీరులు స్వాతంత్ర్య పోరాటంలో ఐక్యంగా పాల్గొన్నారని గుర్తు చేశారు.నేటి కాలంలో ప్రజలు మత సామరస్యతను, జాతి సమైక్యతను కాపాడాల్సిందని పిలుపు నిచ్చారు. ఈ సభలో నాయకులు "సామ్రాజ్యవాద ముర్దాబాద్" అంటూ వందేళ్ల క్రితం షహీద్ భగత్ సింగ్ చేసిన నినాదాన్ని గుర్తుచేశారు. అమెరికా సామ్రాజ్యవాదం ప్రదర్శిస్తున్న హింసక చర్యలకు వ్యతిరేకంగా పోరాడే వారికి భగత్ సింగ్ స్ఫూర్తిగా నిలిచాడన్నారు.భగత్ సింగ్ చెప్పినట్లుగా, దేశంలోని సామాన్య ప్రజలకు ఆకలి, పీడనాల నుండి విముక్తి లభించడమే నిజమైన స్వాతంత్ర్యం. ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలపై పోరాడే వారికి షహీద్ భగత్ సింగ్ తరగని స్ఫూర్తి అందిస్తూనే ఉంటాడన్నారు. భగత్ సింగ్ పుట్టిన గడ్డపై ఆయన ఆశయాలకు మరణం లేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులలో షహీద్ భగత్ సింగ్ స్మారక సమితి కన్వీనర్ అలుగూరి కైలాసం, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య,కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు సంకె రవి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్ బీమా ఉద్యోగుల సంఘం నాయకులు మోతే రామదాసు, ఏ తిరుపతిరెడ్డి, క్యాతం రవి, నేదునూరు కిరణ్, తూముల మల్లేష్, అన్నం రమేష్, కట్టా ప్రకాష్, కుక్కుడపు బాపు, గుమాస ప్రకాష్, వేముల అశోక్, తోట గౌరయ్య, ప్రేమ్ కుమార్, రవూఫ్ మిడివెల్లి రాజ్ కుమార్ లు ఉన్నారు. ఈ సభలో ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు, భగత్ సింగ్ యొక్క త్యాగం, ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శక మన్నారు.

## పెంబి మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణుల పాలాభిషేకం



**ఖానాపూర్ (పెంబి) మార్చ్ 24 (ప్రజా జ్యోతి) :** కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి ప్రజ ప్రభుత్వం రైతు ఖాతాలో రైతు బందుడబ్బులు వేసిన సందర్భంగా పెంబి మండల కాంగ్రెస్ నాయకులు రైతులు హర్షం వ్యక్తం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ల చిత్రపటాలకు మంగళవారంపాలభిషేకం చేశారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రెడ్డి మండల సర్పంచ్ల పూర్వ అధ్యక్షులు మల్లేపల్లి సత్యనారాయణ స్వామి నాయకులు పుప్పాల శంకర్ రమేష్ యాదవ్ జగన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం సర్పంచ్ - సుజాత



**నేరడిగొండ మార్చి 24 (ప్రజాజ్యోతి) :** గ్రామ అభివృద్ధిలో భాగంగా ఈరోజు లఖంపూర్ గ్రామంలో "99 రోజుల పాలన" పురస్కరించుకొని ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సేడమకి సుజాత గంగాధర్, పంచాయతీ సెక్రెటరీ సద్దాం అధ్యక్షత వహించారు. గడచిన 99 రోజుల్లో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సాధించిన ప్రగతిని ఈ సందర్భంగా గ్రామస్థులకు వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ సభలో ఉప సర్పంచ్ రెంగే పూజాతో పాటు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని గ్రామ సమస్యలపై చర్చించారు. డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు మరియు వీధి దీపాల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు.

గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు కోరారు.

## అర్ధరాత్రి బీఆర్ఎస్వీ నాయకుల అరెస్ట్




**రామకృష్ణాపూర్, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. కేతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ముందస్తు చర్యగా జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్‌తో పాటు జిల్లా నాయకులు జిలకర మహేష్, నస్పూరి శివకుమార్, కుర్మ దినేష్‌లను అదుపులోకి తీసుకుని ఆర్‌కేపీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ మాట్లాడుతూ, అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను అణచలేరన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖకు తగిన నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. వెంటనే విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## జాతీయ రహదారుల విస్తరణలో భూ సేకరణ త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 24, మార్చి (ప్రజాజ్యోతి) :** జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా చేపట్టిన భూ సేకరణకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావుతో కలిసి మంగళవారం ఆయన సందర్శించి, భూ సేకరణకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న 63, 163జి జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి జిల్లాలోని భూ సేకరణ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వనపర్తి అభివృద్ధికి ఎమ్మెల్యే మేఘారెడ్డి కృషి

- అసెంబ్లీలో వనపర్తి అభివృద్ధి అంశాల ప్రస్తావన
- వనపర్తి సమగ్రాభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, మార్చి 24 (ప్రజాజ్యోతి: వనపర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కృషి కొనసాగిస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని పరమావధిగా తీసుకుని పలు అభివృద్ధి అంశాలను మంగళవారం అసెంబ్లీలో ప్రస్తావించారు.



హామ్ ప్రాజెక్టు ద్వారా రూ. 400 కోట్లతో వనపర్తి–గోపాల్పేట్–బిజినపల్లి, వనపర్తి–ఖిల్లా ఘణపురం–మొల్గర, వనపర్తి–కొత్తకోట నాలుగు లైన్ల రహదారుల అభివృద్ధికి టెండర్లు పిలిచినందుకు ప్రభుత్వం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వనపర్తి పట్టణ శివారు ప్రాంతాల్లో రహదారి విస్తరణకు సంబంధించిన డ్రైనేజీ నిర్మాణానికి రూ. 25 కోట్లు మంజూరు చేయాలని కోరారు. పెబ్బేరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అదనంగా రూ. 5 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. వనపర్తి నుంచి పెబ్బేరు వరకు ఉన్న 20 కిలోమీటర్ల రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించాలని, కర్నూలుకు లింక్ కావడం వల్ల భారీ ట్రాఫిక్ సమస్య ఉన్నందున దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత మంత్రులను కోరినట్లు చెప్పారు. ఇక వనపర్తి జిల్లా కేంద్రంలో ఆర్అండ్బీకి సంబంధించిన ఎస్సీ కార్యాలయ భవనం నిర్మాణానికి అవసరమైన నివేదికలను సమర్పించి, త్వరితగతిన మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# గుట్టలు కాపాడకపోతే వనపర్తి ఎడారే..!

వనపర్తి ప్రతినిధి, మార్చి 24 (ప్రజాజ్యోతి): వనపర్తి జిల్లాలో గుట్టలు, అడవులను అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజా భవన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సోమవారం సీ.ఎం ప్రజావాణి కార్యక్రమంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా వనపర్తి ప్రాంతంలోని గుట్టలను అక్రమంగా తవ్వుతున్న వారికి కొందరు ప్రజాప్రతినిధులు,



అధికారులు అండదండలు అందిస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, వనపర్తి ప్రాంతానికి గుట్టలు, అడవులు ప్రత్యేక గుర్తింపని, అవి లేకపోతే వర్షపాతం తగ్గి ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. గుట్టలు ఋతుపవనాలను ఆకర్షించి వర్షాలు పడేలా చేస్తాయని, వాటి సంరక్షణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి మైబూస్, గోపాల్ రావు, బాలస్వామి, శేఖర్ నాయక్, ఎంఐఎం, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు పథకాల మీద అవగహన అవసరం -చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 24 (ప్రజా జ్యోతి) నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మిరెడ్డిపల్లె గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ విజ్ఞాన సదస్సును పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ.కే.సురేష్ మరియు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీ.కే.లక్ష్మిపతి గౌడ్ గారు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరియు డిఫెన్స్ కౌన్సిల్ వారు మాట్లాడుతూ వ్యవసాయం అంటే ఆహారం, పశుగ్రాసం, నార, ఇంధనం కోసం మొక్కలను, జంతువులను పెంచడం, భూమిని సాగు చేయడం; ఇది మానవ నాగరికతకు మూలం, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, ఇందులో పంటలు పండించడం, పశుపోషణ, నీటి యాజమాన్యం, సాంకేతికత వినియోగం ముఖ్యమైన అంశాలు, ఆధునిక కాలంలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ప్రాముఖ్యత సంతరించుకుంటున్నాయి.రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి. ఇది మన ఆరోగ్యానికే కాదు, భూమికి కూడా మంచిది. భూసార పరీక్షలు చేయించుకోవడం, పంటల బీమా గురించి తెలుసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు. అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, డ్రిప్ ఇరిగేషన్ వంటివి నీటిని ఆదా చేస్తాయని తెలిపారు. న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందన్ని అన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, సంస్కరణ) చట్టం తెలిపారు.







అక్షరాస్యత మరియు చట్టపరమైన అవగాహన మరియు ముఖ్యంగా, సమాజంలోని బలహీన వర్గాలకు హక్కులు, బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, తమ పిల్లలకు చిన్నవయస్సులో పెళ్లిళ్లు చేస్తే పెద్దవారిదే తప్పుగా తల్లితండ్రుల నిర్వహణ, స్త్రీ మరియు పురుష ఆధిక్యత, మహిళలకు రక్షణ చట్టం ఉన్నదని నిత్యవసర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్త పరచుకొని నష్టం నీకు వారిని ఎదుర్కోకుండా తమను తాను కాపాడుకోవాలని తెలిపారు. వరకట్న వేదింపులు, సఖి సెంటర్, వోల్డేగే హోమ్, గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్ మరియు వినియోగదారుల హక్కుల రక్షణ అవగాహన మరియు న్యాయపరమైన రక్షణ, చట్టపరమైన అవగాహన, ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి, అమలు వంటివి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అన్నారు. వరకట్న వేదింపులు, సఖి సెంటర్, వోల్డేగే హోమ్, గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్ ప్రయోజనాలపై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో మహేష్ (పంచాయతీ సెక్రటరీ), లక్ష్మి గ్రామా సర్పంచ్ , సురేందర్ నాయక్ హెడ్ కానిస్టేబుల్ , మరియు గ్రామా ప్రజలు, వార్డు మెంబెర్స్ , ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

# ఆసుపత్రి అభివృద్ధికి కలెక్టర్ దృష్టి... కొత్త సదుపాయాలకు గ్రీన్ సిగ్నల్

- ₹1 కోట్లతో సీటీ స్కాన్ సెంటర్ – హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచితం

వనపర్తి ప్రతినిధి, మార్చి 24 (ప్రజాజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఎం.ఐ.డి.సి ఇంజనీర్లను





ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సాయినాథ్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్, మాతా–శిశు సంరక్షణ కేంద్రం అధికారులతో కలిసి కలెక్టర్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రూ.1 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సీటీ స్కాన్ సెంటర్, సదరం క్యాంపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. సీటీ స్కాన్ సెంటర్ నిర్మాణాన్ని ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించేందుకు వేగంగా పూర్తి చేయాలని, అవసరమైన యంత్ర సామగ్రికి వెంటనే ఆర్డర్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే వీల్‌చైర్లు, బీపీ కొలిచే పరికరాలు వంటి మౌలిక సదుపాయాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. పాత క్షయ వ్యాధి భవనం తొలగింపు ఆసుపత్రిలో శిథిలావస్థకు చేరుకున్న పాత క్షయ వ్యాధి వార్డు భవనాన్ని రోడ్లు & భవనాల శాఖ అనుమతితో తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలానికి ముందే ఈ పనులు పూర్తి చేయాలని సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన అవసరం అనంతరం కలెక్టర్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. 14–15 సంవత్సరాల కిషోర బాలికలకు ఉచితంగా ఈ వ్యాక్సిన్ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ రాకుండా నివారించేందుకు ఈ వ్యాక్సిన్ ఎంతో కీలకమని, తల్లిదండ్రులు మరియు బాలికలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతి బాలిక ఈ వ్యాక్సిన్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వైద్య పరీక్షలు సందర్శనలో భాగంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆసుపత్రిలో సీబీపీ, హెచ్‌బీ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డా. సాయినాథ్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అరుణ కుమారి, డా. పరిమళ, ఇతర వైద్య సిబ్బంది, ఎం.ఐ.డి.సి సహాయ ఇంజనీరు శివ తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం... 28న జాతీయ లోక్ అదాలత్

- తక్షణ న్యాయానికి అవకాశం
- చిన్న కేసుల పరిష్కారానికి ఉత్తమ వేదిక – కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, మార్చి 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జిల్లాలో పెండింగ్‌లో ఉన్న న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి పిలుపునిచ్చారు. లోక్ అదాలత్ ద్వారా కోర్టుల పరిధిలో ఉన్న అనేక కేసులను సులభంగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ చలానాలు,





మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు వంటి చిన్నచిన్న కేసులు ఇరు పక్షాల అంగీకారంతో త్వరగా పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకునే మంచి అవకాశం ఇదని, శాంతియుతంగా రాజీ పద్ధతిలో సమస్యలు పరిష్కారం కావడం లోక్ అదాలత్ ప్రత్యేకత అని ఎస్పీ వివరించారు. కక్షిదారులు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు.

# ప్రజల భద్రతే లక్ష్యం... రోడ్డు భద్రత, డ్రగ్స్ నియంత్రణపై తగిన చర్యలు తీసుకోవాలి

- వేసవి సెలవుల్లో పిల్లల రక్షణపై ప్రత్యేక దృష్టి – అడ్డాకల్ పీఎస్‌లో ఎస్పీ సమీక్ష

మహబూబ్‌నగర్, మార్చి 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జిల్లాలో ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల





నియంత్రణ, వేసవి కాలంలో పిల్లల రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ ధరవత్ జానకి ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అడ్డాకల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ, స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి మరియు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. నేరాల నియంత్రణలో అప్రమత్తంగా ఉండి, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. “అరైవ్ అలైవ్ ” కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. హెల్మెట్ వినియోగం, అతివేగం నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై యువతలో అవగాహన పెంచి, డ్రగ్స్ అక్రమ రవాణా మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నపిల్లలు ప్రమాదకర చర్యల్లో పాల్గొనకుండా తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా నీటి ప్రాంతాలు, అగ్ని ప్రమాదాలు వంటి వాటి నుంచి దూరంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అడ్డాకల్ ఎస్ఐ శ్రీనివాస్‌కు ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్డాకల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు తక్షణ న్యాయం

- 2019–2026 మధ్య 224 కేసుల్లో రూ.38.33 కోట్లు పరిహారం – 156 కేసులు పెండింగ్

మహబూబ్‌నగర్, మార్చి 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జిల్లాలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా





తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి కేసుల పురోగతి, సంక్షేమ చర్యలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ధరవత్ జానకి పాల్గొన్నారు. సమావేశంలో 2019 నుండి 2026 వరకు నమోదైన అట్రాసిటీ కేసులపై చర్చించారు. మొత్తం 380 కేసుల్లో 224 కేసులకు రూ.38 కోట్ల 33 లక్షల 7 వేల 500 పరిహారం అందించినట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా 156 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతి నెల చివర నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం గురించి కమిటీ సభ్యులకు ముందుగా సమాచారం ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలపై స్పందిస్తూ, మహబూబ్‌నగర్ పట్టణంలోని లక్ష్మీనగర్‌లో ఎస్.సి కార్పొరేషన్‌కు కేటాయించిన భూమిలో ఆక్రమణల అంశాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. కోర్టు కేసులు ఉన్నట్లయితే వాటి పురోగతిని కూడా వివరించాలని సూచించారు. గ్రామాల్లో మత్స్య సహకార సంఘాల ఏర్పాటు సమయంలో ఎస్.సి., ఎస్.టి.లకు 5 శాతం సభ్యత్వం కల్పించాలని, దీనిపై మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఎస్.సి., ఎస్.టి. విద్యార్థులకు చెప్పులు, షూస్ సరఫరాపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, అవసరానికి అనుగుణంగా పంపిణీ జరిగేలా చూడాలని సంబంధిత అధికారిని ఆదేశించారు.
జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ, అట్రాసిటీ కేసుల్లో పోలీస్ శాఖ తక్షణ స్పందనతో చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ హరిప్రియ, అదనపు ఎస్పీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో నవీన్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత, ఇతర శాఖల అధికారులు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సింగోటం లక్ష్మీనరసింహా స్వామిని దర్శించుకున్న.... నాగర్ కర్నూల్ జిల్లా పర్యటక శాఖ అధికారి కలవరాళ్ల నరసింహా....

కొల్లాపూర్ మార్చి 24 ప్రజా జ్యోతి కొల్లాపూర్ మండలం పరిధిలో ఉన్న సింగర్ గ్రామంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న నాగర్ కర్నూల్ జిల్లా పర్యటక శాఖ అధికారి కాలువరాళ్ల నరసింహ మాట్లాడుతూ. 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా పర్యాటక క్షేత్రమైన సింగోటం దేవస్థానాన్ని సందర్శించిన జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల పర్యాటక శాఖ యాక్షన్ ప్లాన్ లో భాగంగా నేడు ప్రముఖ పర్యాటక క్షేత్రమైన సింగోటం లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానాన్ని నాగర్ కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి



కల్వరాల నరసింహ దర్శనం.ఈ సందర్భంగా ఆలయ సీనియర్ అధికారి జనంపల్లి జైపాల్ రెడ్డి మరియు దేవస్థానం సిబ్బంద్ది తో స్వచ్ఛత డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు.సింగోటం క్షేత్రానికి విచ్చేసే పర్యాటకుల సౌకర్యం కొరకు త్రాగునిరు అందుబాటులో ఉంచడం,పబ్లిక్ టాయిలెట్లు, దేవస్థాన ఆలయ ప్రాంగణం శుభ్రత మరియు పర్యాటకుల భద్రత గురించి తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వారికి తెలియజేసారు.

# సిండికేట్ గా మారి పశువుల సంత కైవాసం..?

- 39 లక్షల వెయ్యి రూపాయల పాట పాడి టెండర్ దర్శించుకున్న జగ్జీవన్ రావు
- నిబంధనల మేరకు ఫీజులు వసూలు చేయాలి
- మున్సిపల్ కమిషనర్ డి మురళి

నాగర్ కర్నూల్ మార్చ్ 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపాలిటీలో మంగళవారం జరిగిన పశువుల సంతటెండర్ల ప్రక్రియలో టెండర్ దారులు సిండికేట్ గా మారి పశువుల సంత టెండర్ను గతం కంటే తక్కువ ధరకు దక్కించుకోవడం జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. మొదటగా మున్సిపల్ చైర్మన్ కమిషనర్ డి మురళి ఆధ్వర్యంలో టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. మున్సిపాలిటీ



నిర్ణయించిన నిబంధనల మేరకు వేలంపాట ప్రారంభించగా అత్యధికంగా వేలం పాట పాడి జగ్జీవన్ రావు 39 లక్షల ఒక వెయ్యి రూపాయలకు దక్కించుకోవడం జరిగింది. అనంతరం మున్సిపల్ చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ త్రై బజార్లో నిర్ణయించిన ధరల మేరకు రైతుల వద్ద కొనుగోలు దారుల వద్ద రుసుము తీసుకొని, రషీద్ ఇవ్వాలని చైర్మన్, గార్లపాటి శ్రీనివాసులు కమిషనర్ డి మురళి పేర్కొన్నారు. అదేవిధంగా సకాలంలో మూడు విడతల్లో వేలంపాటలో పాడిన రుసుమును చెల్లించాలని టెండర్ దారునికి సూచించారు. ఇదిలా ఉండగా సిండికేట్ గా మారడం ద్వారా మున్సిపాలిటీకి కొంత ఆదాయం తగ్గిందని స్పష్టమవుతుందని అక్కడ జరిగిన సినారియోను బట్టి ఆరోపణలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టెండర్ దారులతో పాటు మున్సిపల్ కమిషనర్ డి మురళి, మేనేజర్ కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గాలి కుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాలు-పాడి రైతులకు కలెక్టర్ పిలుపు

గట్టు మార్చి 24(ప్రజా జ్యోతి): గట్టు మండలం లింగాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో,భవిష్య భారత్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో మంగళవారం గాలి కుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాల మెగా క్యాంపు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వం





ఉచితంగా అందిస్తున్న టీకాలను పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా వేయించి వ్యాధి నివారణకు కృషి చేయాలని సూచించారు.టీకాల పంపిణీపై అధికారులు ముందస్తుగా గ్రామాల వారీగా టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.గ్రామస్తులు ఐకమత్యంగా ఉంటే తాగునీరు,డ్రైనేజీ వంటి సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు.భవిష్య భారత్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థలు గ్రామాభివృద్ధికి చేస్తున్న సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం కలెక్టర్ సమక్షంలో పశు వైద్యాధికారులు పశువులకు టీకాలు వేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు కలెక్టర్‌ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి,ఎంపీడీవో చెన్నయ్య,సర్పంచ్ శకుంతలమ్మ,పశు వైద్యాధికారులు,ఇతరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు

బి ఆర్ ఎస్ వి జిల్లా నాయకుడు

కొల్లాపూర్ మార్చి 24 ప్రజా జ్యోతి విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ సర్కార్ తీరుకు నిరసనగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి. ఉదయమే అరెస్టు చేసిన పోలీసులు ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు డి శేఖర్ మాట్లాడుతూ, బడ్జెట్ లో విద్యకు 18% ఇవ్వాలని కమిషన్ సిఫారసు చేస్తే ప్రభుత్వం 8%కే పరిమితం చేసింది.గత సంవత్సరం బడ్జెట్ లో పెట్టిన రీయింబర్స్‌మెంట్ నిధులను 80% కూడా విడుదల చేయలేదు అన్ని అన్నారు బకాయిలు రూ. 8 వేల కోట్లు ఉంటే బడ్జెట్ లో రూ.4 వేల కోట్లే కేటాయింపు విద్యార్థులను కళాశాల యాజమాన్యాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.10 వేల కోట్ల బకాయిల ప్రస్తావన బడ్జెట్ కేటాయింపులో లేదు ఈ బడ్జెట్లో పెరిగిన ధరలకు





అనుగుణంగా వివిధ కోర్సుల ఫీజులు పెంచుకునే అవకాశం కాలేజీ యాజమాన్యాలకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెంచాలనే ఆలోచన చేయలేదు అన్ని అన్నారు స్కూల్ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ మరియు మిల్క్, జావ ఇవ్వటం కేసీఆర్ గారి ప్రభుత్వం ప్రారంభించినదే. అది కాంగ్రెస్ పథకం కాదు ఈ బడ్జెట్లో విద్యానిధి పథకం పెట్టలేదు, రూ.5 లక్షల విద్యా రుణం హామీ ఊసేలేదు 18 సంవత్సరాలు నిండిన బాలికలకు స్కూటీ పథకం లేదు రెండు లక్షల ఉద్యోగాలతో కూడిన జాబ్ కాలెండర్ అమలు చేయాలని ప్రియాంక గాంధీ ప్రచార హామీకి విలువ ఇవ్వని రేవంత్ ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్. కార్యక్రమంలో విద్యార్థి సంఘం బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విధానాలపై వ్యవసాయ కార్మికుల ఆగ్రహం



**హసన్‌పర్తి, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మంద సుచందర్ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ పేదలపై నిరంతరం దాడులు కొనసాగిస్తున్నదని విమర్శించారు. గ్రామీణ పేదల ప్రాణాధారమైన ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే కుట్రలు జరుగుతున్నాయని, నిధులు తగ్గించడం, పనిదినాలు కోత పెట్టడం ద్వారా కార్మికులను సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పేదల జీవనోపాధిని కుదించే చర్యగా అభివర్ణించారు. ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాల్సిన బదులు కుదించడం అన్యాయమని మండిపడ్డారు. పట్టణ పేదలకు తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించాలని, కొన్ని చట్టాలను రద్దు చేయాలని, రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించి అందించాలని కోరారు. విద్యార్థుల పెండింగ్ విద్యాసహాయం, ఫీజు చెల్లింపులను వెంటనే విడుదల చేయాలని, త్రాగునీరు మరియు సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఉపాధి హామీ పనిదినాలను కనీసం 200 రోజులకు పెంచాలని, రోజువారీ వేతనాలను పెంచి జీవనానికి సరిపడే విధంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాపాడకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. దేశంలో పెరుగుతున్న ధరల భారంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకాన్ని మరింత బలంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేదల సమస్యలను పట్టించుకోకుండా పెద్ద వ్యాపార వర్గాలకు అనుకూల విధానాలు అమలు చేయడం తప్పని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు వేలు రజిత, ఎండి అజీమా, పల్లె చందన, కుర్ర పద్మావతి, రమ్య, మంజుల, అశ్విని, సుకన్య, రాణి తదితరులు, ప్రజా సంఘాల నాయకులు వేలు సుమన్, నాంపల్లి మౌనిక పాల్గొన్నారు.

## క్షయ రహిత జిల్లా కోసం కృషి చేద్దాం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- స్క్రీనింగ్ పరీక్షల ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**ఆత్మకూరు, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు. హై రిస్క్ ఉన్న గ్రామాలలో స్క్రీనింగ్ పరీక్షల నిర్వహించాలని అన్నారు. వంద శాతం స్క్రీనింగ్ పరీక్షలు జరగాలన్నారు. టీబీ బారిన పడిన వారికి ప్రభుత్వంతో ప్రైవేట్ ఆస్పత్రులు, ఉద్యోగుల నుండి పౌష్టిక ఆహారం కలిగిన న్యూట్రిషన్ కిట్లను అందజేయడం అభినందనీయమన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ కీలకపాత్రను పోషించాలన్నారు. వచ్చే ఏడాది ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం నాటికి హనుమకొండ జిల్లాను టీబీ ముక్త్ జిల్లాగా చేసేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని, అందుకు కృషి చేయాలని కోరారు. టిబి వ్యాధి లక్షణాల బారిన పడి నిర్ధారణ అయిన వారు ఆరు నెలలపాటు సరైన మందులు, పౌష్టిక ఆహారం తీసుకున్నట్లయితే వ్యాధి నుంచి కోలుకోవచ్చని అన్నారు. అందరూ ఆలోచించి కలిసి పనిచేస్తే టీబీ నివారించవచ్చునని పేర్కొన్నారు. కొన్ని గ్రామాలలో వంద శాతం స్క్రీనింగ్ చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో టీబీ నియంత్రణకు కృషి చేస్తామని అధికారులు, ప్రజలతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా 630 మంది టీబీ చికిత్స తీసుకుంటున్న వారికి న్యూట్రిషన్ కిట్స్ అందించిన ఆదిత్య హాస్పిటల్,ఇండియన్ రెడ్ క్రాస్ ,చక్రవర్తి హాస్పిటల్,ప్రతిమ రిలీఫ్ , ప్రశాంతి హాస్పిటల్,శ్రీ చక్ర ఆస్పత్రుల వారికి, అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించి ఇతరులు వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలన్నారు. టీబీ చాంపియన్‌లు, టీబీ నియంత్రణలో కృషిచేసిన సిబ్బందికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డిఓ డాక్టర్ నారాయణ మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా డాక్టర్ల వద్ద పరీక్ష చేయించుకుని నిర్ధారణ అయితే చికిత్స తీసుకోవాలని, చికిత్స కాలంలో మంచి పోషకాహారం తీసుకోవాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ రెండవ దశ కార్యక్రమంలో 100 రోజుల క్యాంపెయిన్ ను ఈరోజు ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ అంశములను దృష్టిలో పెట్టుకొని 2,492 గ్రామాలను హైరిస్క్ గ్రామాలుగా గుర్తించగా మన జిల్లాలో 25 గ్రామాలను హై రిస్క్ గ్రామాలుగా గుర్తించడం జరిగినది. ఈ గ్రామాలలో వంద రోజులలో 14 సంవత్సరంలు పైబడిన వారందరినీ పరీక్షించి, ఎక్స్రే మరియు సిబి నాట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 2025 సంవత్సరంలో 1614 టీవీ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించడం జరిగింది. 1416 మందికి కిచ పూర్తి కావడం జరిగింది అలాగే 252 మందికి నిక్షయ్ పోషన్ యోజన ద్వారా ప్రతినెల 1000 రూపాయలు చొప్పున ఆరు నెలల కాలం పాటు అందించడం జరిగిందన్నారు. జిల్లా టీవీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు జిల్లాలో నిర్వహించిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమ వివరాలను, ఇది వ్యాధి లక్షణములను తీసుకోవాల్సిన జాగ్రత్తలను చికిత్స గురించి మాట్లాడడం జరిగింది. ఈ రోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్పెషలిస్ట్ వైద్యుల శిబిరంలో 6 విభాగముల స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య సేవలు అందించడం జరిగింది అలాగే అవసరమైన వారికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి , డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ఎంపిడీవో శ్రీనివాస్ రెడ్డి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రుబీనా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్పందన, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్ రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## వీరశైవ జంగమ లింగ బలిజ విద్యార్థి ప్రతిభ పురస్కారాలు







**కోకిలవాయ మఠం ఎడ్యుకేషనల్ సొసైటీ, కోకిలవాయ మఠం గిరిజామణి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో యువ మేధస్సులకు ప్రేరణ**

**హనుమకొండ, మార్చి 24 (ప్రజా జ్యోతి) :** వీరశైవ జంగమ / లింగ బలిజ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు కోకిలవాయ మఠం ఎడ్యుకేషనల్ సొసైటీ, కోకిలవాయ మఠం గిరిజామణి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాల కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీ సునీల్ కుమార్ నివాసంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్.ఐ.టి. వరంగల్ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డా. రామశేషు హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఆర్ట్స్, సైన్స్, కామర్స్ వంటి అన్ని రంగాల్లో స్మార్ట్‌గా నేర్చుకోవాలని సూచించారు. జ్ఞానంతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా తమ ఆసక్తి ఉన్న రంగాన్ని గుర్తించి అందులో ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు. సంస్థ అధ్యక్షుడు శ్రీ సదాశివ మూర్తి మాట్లాడుతూ, ఈ సంస్థ స్థాపన వెనుక ఉన్న లక్ష్యాన్ని వివరించారు. ధర్మసాగర్, వెలైర్, మడికొండ, శ్రీపతిపల్లి ప్రాంతాల్లో దశాబ్దాల పాటు ఉపాధ్యాయులుగా సేవలందించిన పెద్ద సాంబయ్య, చిన్న సాంబయ్య, సదానిరంజన్, సదానందం, గిరిజామణి వంటి మహనీయుల సేవలను స్మరించారు. వారి స్ఫూర్తితోనే 2000లో కోకిలవాయ మఠం ఎడ్యుకేషనల్ సొసైటీ స్థాపించబడిందని తెలిపారు. అనంతరం జంగమ మరియు లింగ బలిజ సమాజానికి చెందిన బాలికల విద్యాభివృద్ధి కోసం గిరిజామణి మెమోరియల్ ట్రస్ట్ ప్రారంభించబడినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఎస్ సి 2024--2025 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. చోలేటి శ్రుతి (పార్కల్), విభూతి వేదమయి (గురిజాల, నర్సంపేట), పనుగంటి సహస్ర (పార్కల్), గురుమూర్తి శివచరణ్ (హసన్‌పర్తి)లకు ల్యాప్‌టాప్ బ్యాగులు మరియు రూ.1000 నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ సభ్యుడు పి.సదాశివ, సొసైటీ కార్యదర్శి కె.బి.డి. ప్రకాశ్, సభ్యురాలు శ్రీమతి కె.సారల, ట్రస్టీ సభ్యుడు శ్రీ సునీల్ కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని సమన్వయం చేసి విద్యార్థులకు భవిష్యత్ లక్ష్యాలపై విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా ముగియగా, సభ్యులు విద్యార్థుల భవిష్యత్ విజయాల కోసం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. "ప్రతిభను ప్రోత్సహిస్తూ... భవిష్యత్తును శక్తివంతం చేస్తూ" అనే సందేశంతో ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

## ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా 'వంగల రాజేంద్రప్రసాద్'

ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు అవార్డు



**ఆత్మకూరు, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉత్తమ సేవలు అందించిన వంగల రాజేంద్రప్రసాద్‌కు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి చేతుల మీదుగా, సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏ.అప్పయ్య, క్షయవ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ కె.హిమబిందు సమక్షంలో అవార్డు ప్రదానం జరిగింది. అవార్డు స్వీకరించిన అనంతరం రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. తనకు సహకరించిన అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## అటవీ దినోత్సవం వేడుకల్లో సుజాత విద్యానికేతన్‌కు అరుదైన గౌరవం

**పర్యావరణ సేవలకు ఆకుతోట శాంతారాం కర్ణకు ప్రత్యేక జ్యూరీ పురస్కారం**



**హసన్‌పర్తి, మార్చి 23 (ప్రజాజ్యోతి) :** ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హసన్‌పర్తి సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఆకుతోట శాంతారాం కర్ణకు వరంగల్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పర్యావరణ ప్రత్యేక జ్యూరీ పురస్కారం ప్రదానం చేయబడింది. వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ, ఓరుగల్లు వన్యప్రాణి సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో అటవీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దీపప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ వేడుకలో జిల్లా అటవీశాఖ అధికారి మనోజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత 35 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణలో విశేష కృషి చేస్తున్న ఆకుతోట శాంతారాం కర్ణ సేవలను అధికారులు ప్రశంసించారు. పాఠశాల పర్యావరణ మిత్ర విభాగం ఆధ్వర్యంలో ఇప్పటివరకు 40 వేల మొక్కలు నాటడం, జల సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు తవ్వించడం, చెరువుల పరిశుభ్రత కోసం చర్యలు చేపట్టడం, 40 వేల మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ధరిత్రి దినోత్సవం, పర్యావరణహిత రంగవల్లులు, కాలుష్య రహిత దీపావళి వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో, ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సేవలకు గుర్తింపుగా జాతీయ, రాష్ట్ర స్థాయిలలో ఆరు సార్లు పర్యావరణ మిత్ర పురస్కారాలు సహా సుమారు 50 వేలకుపైగా పురస్కారాలు అందుకున్నారు. ఇంతటి గౌరవాలు సాధించిన పాఠశాలగా సుజాత విద్యానికేతన్ ప్రత్యేక స్థానం సంపాదించింది. ఈ కృషిని గుర్తించి అటవీ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా పర్యావరణ ప్రత్యేక జ్యూరీ పురస్కారం అందజేశారు. ఇదే సందర్భంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో సుజాత విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటారు. వ్యాసరచనలో టీ. కార్తీక (9వ తరగతి) ప్రథమ, ఎం.డి. రుక్సానా (8వ తరగతి) ద్వితీయ బహుమతులు సాధించారు. చిత్రలేఖనంలో ఎం. రామ్ తేజ్ (8వ తరగతి) ప్రథమ, ఎం.డి. యాకూబ్ పాషా (9వ తరగతి) ద్వితీయ బహుమతులు అందుకున్నారు. పోటీల్లో పాల్గొన్న 25 మంది విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, కవచాలు అందజేశారు. పురస్కారం సాధించిన ఆకుతోట శాంతారాం కర్ణను పాఠశాల ఉపాధ్యాయులు, ఉప ప్రధానోపాధ్యాయుడు గూడూరు లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు.

## ఇనగాలకు కృతజ్ఞతలు



**పరకాల, మార్చి, 24, (ప్రజాజ్యోతి):** పరకాల పట్టణానికి చెందిన బొచ్చు శరత్–చైతన్య దంపతుల ఆరు నెలల చిన్నారి ఋత్విక గుండె సమస్యతో బాధపడుతుం డగా, అత్యవసర శస్త్రచికిత్స అవసరమైంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబం ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సహాయం కోరగా, ఆయన వెంటనే స్పందించారు. ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్ యాజమాన్యంతో సమన్వయం చేసి, 'హృదాన్' ప్రోగ్రామ్ కింద జూబ్లీహిల్స్ అపోలోలో మార్చి 18న ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స విజయవంతమై చిన్నారి ప్రస్తుతం కోలుకుంటోంది. ఈ సందర్భంగా చిన్నారితో కలిసి తల్లిదండ్రులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి ఆరోగ్యం మెరుగుపడటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, పాప భవిష్యత్తు మంచిగా ఉండాలని ఆకాంక్షించారు.

## ముమ్మిడివరం గ్రామంలో అన్నలపై తమ్ముడి కక్షసాధింపు..పచ్చని పంట నాశనం..!





**సంగెం, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** వ్యక్తిగత కక్షలతో తన సొంత అన్నల ఎదుగుదలను ఓర్వలేక,కష్టపడి సాగు చేసిన పంటపై గడ్డి మందు పిచికారీ చేసి నాశనం చేసిన అమానుష ఘటన మండలంలోని ముమ్మిడివరం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ విషయంపై బాధితులు మంగళవారం రోజున విలేకరుల సమావేశంలో తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లక్క శ్రీనివాస్ లక్క నగేష్ మాట్లాడుతూ..మా తమ్ముడు అయిన లక్క సుధాకర్ మేము వేసుకున్నటువంటి పంట చేను పై గడ్డి మందు కొట్టి పంట నాశనం చేసినాడని, లక్క సుధాకర్ స్థానిక ఎమ్మార్వో ఆఫీసులో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడని, అతనిపైన చర్యలు తీసుకోవాలని అన్నారు మేము నలుగురం అన్నదమ్ములమని పెద్దాయన పేరు లక్క రమేష్,రెండో వ్యక్తి లక్క శ్రీనివాస్, మూడో వ్యక్తి లక్క నగేష్, నాలుగో వ్యక్తి లక్క సుధాకర్.మా నాన్న పేరు లక్క సాయిలు మా నాన్న చనిపోకముందు మస్కూరిగా పనిచేసేవాడు.నాన్న చనిపోయిన తర్వాత ఈ ఎలతనం ఎవరికి రావాలి ఎవరు చేయాలి, అని మేము నలుగురు అన్నదమ్ములం పోటీపడినాము.దీనికి నలుగురం ఒక ఒప్పందానికి వచ్చి, మన కుటుంబ సభ్యుల సమక్షంలో పెద్దమనుషులను తీసుకొని వచ్చి సమస్య పరిష్కారం చేసుకుంటామని ఒప్పుకొని ముగ్గురు పెద్ద మను షులు బోనాల మల్లయ్య, మడత స్వామి,మడత కేశవులు వారి సమక్షంలో సమస్య పరిష్కరించుకున్నాము.నలుగురి అన్నదమ్ముల పేరు మీద చీటీలు వేసుకొని ఎవరి పేరు వస్తే వారు పాలి వాళ్ళ ఖర్చులు చూసుకొని మా ముగ్గురి అన్నదమ్ములకు తల ఎనిమిది గంటల భూమి ఇవ్వాలని పెద్దమనుషులు తీర్మానం చేసుకొని వస్తే అందుకు మీ అందరం ఒప్పుకొని చీటీలు తీసుకోగా మా తమ్ముడు అగు లక్క సుధాకర్ కు చీటీ వచ్చింది.ఒప్పందం ప్రకారం మా తమ్మునికి ఉద్యోగం రావడానికి మేమందరం అఫీడవిట్ పై సంతకం చేసి అతనికి ఉద్యోగం వచ్చేలా ఒప్పుకున్నాము తర్వాత మాకు ఒప్పందం ప్రకారం తల ఎనిమిది గంటల భూమిని 2015వ సంవత్సరంలో మాకు అతని పేరు మీద ఉన్న భూమిని అప్పగించగా అప్పటినుండి మేము దాన్ని సాగు చేసుకుంటూ వచ్చాము.2024 సంవత్సరంలో మేము భూమిని చదును చేసుకుంటున్నాము దాన్ని మా పేరు మీదికి మార్చమని మా తమ్ముడు ఆగు లక్క సుధాకర్‌ను అడుగగా మీకు భూమి ఇవ్వను డబ్బులే ఇస్తాను మీ దిక్కున చోట చెప్పుకోండి నాకు ఎమ్మార్వో తెలుసు ఆర్డీఓ తెలుసు కలెక్టర్ తెలుసు నన్ను ఎవరూ ఏమీ చేయలేరు నా ఉద్యోగాన్ని ఎవరు తీపించలేరు అని అప్పటి నుండి పోలీస్ స్టేషన్ ఎమ్మార్వో ఆఫీస్ కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరిగేలా మమ్మల్ని నానా ఇబ్బందులకు గురి చేస్తూ మాపై కేసులు పెడుతూ ఆనందంగా ఉద్యోగాన్ని అనుభవిస్తున్నాడు. సమస్య పరిష్కారం కొరకు 2025 నవంబర్ నెలలో తాసిల్దార్ కు ఫిర్యాదు ఇవ్వగా అతను పెద్దమనుషల సమక్షంలో సమస్య పరిష్కరించుకొమ్మని లేనిపక్షంలో సుధాకర్ పై చర్యలు తీసుకుంటానని మాకు హామీ ఇవ్వగా మేము పెద్ద మనుషులను సంప్రదించగా పంచాయితీ 2026 ఫిబ్రవరి నెలలో కూర్చొని మాట్లాడుకోగా అక్కడికి వచ్చిన పెద్దమనుషులు సాక్షులను విచారించగా సుధాకర్ గతంలో వారి అన్నదమ్ములకు తల ఎనిమిగుంటలు భూమి ఇచ్చినట్లుగా అప్పుడు భూమి ఇస్తానని ఒప్పుకున్నది వాస్తవమే కానీ ఇప్పుడు నేను భూమి ఇవ్వను భూమికి బదులు డబ్బులు ఇస్తానని వెళ్లిపోయాడు. మేము రైతులమని హేళనగా హేళన చేస్తూ ఉద్యోగాన్ని ఆస్వాదిస్తూ మమ్ముల ఖర్చుల పాలు చేస్తూ మేము వేసుకున్న పంటను నాశనం చేసి దర్జాగా తిరుగుతున్నాడని వాపోయారు. ఉద్యోగం ఉందని అహంతో రైతులమైన మమ్మల్ని భూమి ఇవ్వకుండా నానా ఇబ్బంది లకు గురి చేస్తున్నాడు.ఇది రైతులందరూ, అధికారులు గుర్తించి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్న,మా పంట నాశనం చేసిన లక్క సుధా కర్‌పై కఠినమైన,చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు ఇచ్చినటువంటి పొలాన్ని మాకు ఇప్పించి పంట నష్టం పరిహారాన్ని ఇప్పియాలని మాకు న్యాయం చేయవలసిందిగా ప్రతి ఒక్కరిని పేరుపేరునా మీడియా పరంగా మేము చేతులెత్తి నమస్కారం చేస్తున్నామని కన్నీటి పర్యంతమయ్యారు

## తైబజార్ సంత వేలం వాయిదా..

**అప్సెట్ ప్రైజ్ రాకపోవడంతో మరోసారి వేలం నిర్వహణ**

**పర్వతగిరి, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండలంలోని గ్రామ పంచాయతీ అన్నారం షరీఫ్ అధీనంలో ఉన్న తైబజార్ సంతకు సంబంధించిన 2026-27 సంవత్సరానికి బహిరంగ వేలం నిర్వహించగా, ఆశించిన స్థాయిలో ప్రభుత్వ నిర్ణయించిన అప్సెట్ ప్రైజ్ (కనిష్ఠ ధర) రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు మండల పంచాయతీ అధికారి శేషంజన్ స్వామి తెలిపారు. ఈ వేలంలో మొత్తం ఐదుగురు డిపాజిట్ దారులు పాల్గొన్నప్పటికీ, సరైన ధర నమోదు కాకపోవడంతో అధికారులు మరోసారి వేలం నిర్వహించాలని నిర్ణయించారు. తదుపరి వేలాన్ని మార్చి 26, 2026 (గురువారం) ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 2 లక్షలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. గాడిపెల్లి మహేందర్, సర్పంచ్, మొహమ్మద్ మొయినోద్దీన్, పంచాయతీ కార్యదర్శి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.



# ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం అవగాహన కార్యక్రమం ర్యాలీ

**– డాక్టర్ ఫిరోజ్, వైద్యాధికారి,అనంతగిరి**




**మార్చి 24, అనంతగిరి (ప్రజాజ్యోతి) :** ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అనంతగిరి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్ మాట్లాడుతూ క్షయ వ్యాధి తుంపర్ల, దగ్గు ద్వారా గాలిలో మైక్రో బ్యాక్టీరియా టూబరిక్లోసెస్ అనే క్రిమి ద్వారా ఒకరి ద్వారా ఒకరికి అంటుకునే వ్యాధి ఈ యొక్క వ్యాధి యొక్క లక్షణాలు ఎడతెరిపి లేకుండా దగ్గు,జ్వరం, ఆకలి మందగించడం,ఆయాసం, బరువు కోల్పోవడం, చాతిలో మంట, వీటిలో ఏ ఒకటి రెండు లక్షల ఉన్న టీబీగా అనుమానించి,శ రే ద్వారా పరీక్షలు నిర్వహించి క్షయ వ్యాధి నిర్ధారణ అయినట్లయితే మందులు ఇూూ చికిత్స విధానం ద్వారా పూర్తి కాలం వాడి జబ్బును పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ఈ వ్యాధి బారిన పడినవారు ఎక్కువగా వయసు వారు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వాళ్లు, ఇంటిలో ఎవరికైనా క్షయ వ్యాధి బారినపడి వారి కుటుంబ సభ్యులకు, కార్మికులుగా పనిచేసే వారిలో మరియు స్ట్రీట్ వెండర్ వారికి గతంలో మందులు వాడి పూర్తయిన వారికి ఒక్కొక్కసారి వ్యాధి మరల పడే అవకాశం ఉన్నందున పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. స్థానిక ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ద్వారా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించుకుని ఒకవేళ క్షయ వ్యాధి నిర్ధారణ అయినట్లయితే ఉచితంగా మందులు వాడి పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పనకబండ గ్రామానికి లైన్మెన్ నియామకం చేయాలి

**గ్రామ ప్రతినిధుల విజ్ఞప్తి**



**మోత్కూరు మార్చి 24 (ప్రజాజ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల పరిధిలోని పనకబండ గ్రామానికి లైన్మెన్ లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామ ప్రతినిధులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో మోత్కూరు మండల విద్యుత్ ఏఈని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు తరచుగా తలెత్తుతున్నప్పటికీ, లైన్మెన్ అందుబాటులో లేకపోవడంతో చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి కూడా ఆలస్యం జరుగుతోందని వారు పేర్కొన్నారు. దీంతో రైతులు, గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లోతుకుంట రేణుక అనిల్ కుమార్ మాట్లాడుతూ, పనకబండ గ్రామానికి తక్షణమే ఒక లైన్మెన్ మరియు అసిస్టెంట్ లైన్మెన్‌ను నియమించాలని అధికారులను కోరారు. గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాధారపు మల్లేష్, మాజీ సర్పంచ్ బత్తిని తిరుమలేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వేం నరేంద్ర రెడ్డిని కలిసిన సర్పంచి:ముద్దం మల్లేష్



**చింతపల్లి మార్చి 24 (ప్రజాజ్యోతి) :** చింతపల్లి మండలం మోదుగులమల్లెపల్లి గ్రామ సర్పంచి ముద్దం మల్లేష్ గౌడ్ నూతనంగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్ లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం వేం నరెడర్ రెడ్డిని పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.అయితే వేం నరేందర్ రెడ్డి మహబూబాబాద్ నియోజకవర్గం నుండి 2004–2009 మధ్యకాలంలో ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించాడు.ఆయనను 2024 జనవరి 20న తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడి (పబ్లిక్ ఎఫైర్స్)గా నియమించింది.నాటి నుండి అదే హోదాలో కొనసాగిన నరేందర్ రెడ్డి ఈ నెల రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికల్లో నామినేషన్ వేయగా తెలంగాణ రాష్ట్రం నుండి ఇద్దరు రాజ్యసభ సభ్యుడులు ఏకగ్రీవంగా ఎన్నుకోగా అందులో వేం నరేందర్ రెడ్డి ఉన్నాడు.నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ని ముద్దం మల్లేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి గ్రామంలో నిర్మించబోయే నూతన ఆలయానికి,గ్రామ అభివృద్ధికి తన సహాయ సహకారాలు కావాలని మోదుగులమల్లెపల్లి సర్పంచి ముద్దం మల్లేష్ కోరారు.

# బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలి: సర్పంచ్ మేడుదుల రమేష్



**తుంగతుర్తి, మార్చి 24,(ప్రజా జ్యోతి) :** పిల్లల తల్లిదండ్రుల తో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరు గ్రామంలో జరుగుతున్న బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం కృషి చేయాలని గ్రామ సర్పంచ్ మేడుదుల రమేష్ సూచించారు.మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన గ్రామస్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు గురించి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి లక్ష్మీనర్సయ్య ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాజంలోని బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి లక్ష్మీ నరసయ్య అన్నారు. గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ లో 15 మంది సభ్యులు ఉంటారనీ 0 నుండి 18 సంవత్సరం లోపు పిల్లలకు ఎలాంటి సమస్య వచ్చిన ఈ కమిటీ సభ్యులు పిల్లల కోసం పని చెయ్యాలి అని తెలియజేశారు. బాలల హక్కుల గురుంచి బాలల సమస్యలు బాల కార్మకులు ,రక్షణ చర్యలు బాల్య వివాహాలు, అధికారుల బాధ్యతలు చైల్డ్ హెల్ప్ లైన్1098 బాలలపై వేధింపులు మొదలైన బాలలకు సంబంధించిన అంశాలను గురుంచి అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ స్వరూప రాణి,బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ ఎ.శోభా రాణి, 1098 ఉమా మహేశ్వరి,గ్రామ సభ్యులు వెంకన్న అంగన్వాడి టీచర్లు, లక్ష్మి బాయి,శారద, వార్డు సభ్యులు అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్




**తుంగతుర్తి, మార్చి 24,(ప్రజా జ్యోతి) :** తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు.అన్నారం గ్రామంలో మాజీ ఎంపీటీసీ కుంచాల జనార్ధన్ రెడ్డి మరణించడంతో ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసే నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వెలుగుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కుమ్మరి వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి మృతిచెందగా ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధ్యత కుటుంబ సభ్యులను ఆదరిస్తూ వారికి ధైర్యం చెప్పి పార్టీ కోసం కృషి చేసిన కార్యకర్తలను ఎప్పటికీ మర్చిపోలేము అని పేర్కొన్నారు. ఆయన వెంట అన్నారం గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, దొంగరి శ్రీను, కదారి దేవదాసు, మట్టిపల్లి వెంకట్, వెలుగు పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లెపాక రాములు, మాజీ ఎంపిటిసి మట్టపల్లి కవిత, గుడిపాటి వీరయ్య,గడ్డం సోమేశ్, జలంధర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# బిఎన్ తిమ్మాపురం గ్రామాన్ని, నూతన కాలనీని, సందర్శించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

– భూ నిర్వాసితులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తాం

– వెంటనే, ముఖ్యమంత్రితో మాట్లాడి, బస్వాపూర్ ప్రాజెక్ట్‌లో ఇండ్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానని సర్పంచ్ కు జిల్లా కలెక్టర్ హామీ




**భువనగిరి,రూరల్ 24 (ప్రజాజ్యోతి) :** యాదాద్రి,భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ని,సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి గత కొద్ది,రోజుల క్రితం కలిసి బిఎన్ తిమ్మా పురం,గ్రామ సమస్యల గురించి వివరించి వినతి పత్రాన్ని,అందించి,మా పునరావాసం నూతన గ్రామాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరిం చాలని కోరగా,సర్పంచ్ ఆహ్వానం మేరకు కలెక్టర్ స్పందించి,బుధవారం పునరా వాస నూతన బిఎన్ తిమ్మాపురం,గ్రామాన్ని అడిషనల్ కలెక్టర్,ఆర్డీఓ తహసీల్దార్,ఇతర శాఖల అధికారులతో కలిసి సందర్శించి,అక్కడ ఉన్న సమస్యలను గురించి సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ని అడిగి తెలుసుకున్నారు.సర్పంచ్ కలెక్టర్ తో విన్నవిస్తూ,మా నూతన గ్రామంలో ఎలాంటి మౌలిక,వసతులు ఏర్పాటు చేయకుండా అస్తవ్యస్థంగా కాలనీని ఏర్పాటు చేశారని, గ్రామస్థులు అందరు ఇండ్ల నిర్మాణం చేస్తున్నందున అన్ని రకాల మౌలిక వసతులు, రోడ్లు,నల్లాలు,డ్రైనేజీ,స్కూల్ బిల్డింగ్ నిర్మాణం,హాస్పటల్ వంటి,నిర్మాణాలు త్వరగా నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా,నూతన గ్రామానికి మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నందున మిషన్ భగీరథ వాటర్ సప్లై,చేయాలని కోరారు.అన్ని రకాలుగా నష్టపోయిన మా గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టి మా సమస్యలు అన్ని పరిష్కరిం చాలని అన్నారు.అదే విధంగా భువనగిరి,మాజీ సింగిల్విండో చైర్మన్ ఎడ్ల సత్తి రెడ్డి గ్రామ పెద్దలు గ్రామస్థులు కలెక్టర్‌తో మాట్లాడుతూ మా ఇండ్ల నష్టపరిహారం కూడా ప్రభుత్వంతో మాట్లాడి త్వరగా ఇప్పించాలని కలెక్టర్ కోరారు.ఈ సందర్భంగా కలెక్టర్ తక్షణమే స్పందించి అన్ని శాఖల అధికారులను అదేశించి పునరావాసం గ్రామంలో,మౌలిక వసతుల ఏర్పాటుకు త్వరగా కృషి చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్ మరియు పంచాయతీ రాజ్ శాఖ అధికారులను,పనులు త్వరతగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మరియు మిషన్ భగీరథ అధికారులకు ఫోన్ చేసి అతి త్వరలో,పునరావాసం కాలానికి మిషన్ భగీరథ నీళ్లు సప్లై చేయాలని కోరారు. అలాగే,సెక్టార్ 1 కి ఉన్న రోడ్డు సమస్యను కూడా త్వరలో పరిష్కరించి రోడ్డును అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు.ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఇండ్ల నష్టపరిహారం కూడా త్వరగా ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు.ఇక నుండి మీ పునరావాసం గ్రామం సమస్యలపై,15 రోజులకు ఒకసారి రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి అన్ని సమస్యలు పూర్తి అయ్యేంత వరకు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,సర్పంచ్ కి గ్రామ పెద్దలకు, గ్రామస్థులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,మాజీ ఎంపిటిసిలు,మాజీ సర్పం చులు,మాజీ ఉప సర్పం చులు,వార్డు సభ్యులు, గ్రామస్థులు నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ గ్రంథాలయాలకు వెలుగుదారి... సేవకు లభించిన గౌరవం

• గ్రామీణ ప్రాంతాల్లో జ్ఞానం అందుబాటులోకి రావాలంటే గ్రంథాలయాల అభివృద్ధి అత్యంత అవసరం.

• అవార్డు గ్రహీత దాయం ఝాన్సీ రాజిరెడ్డి





**తుంగతుర్తి, మార్చి 24,(ప్రజా జ్యోతి) :** గ్రామీణ ప్రాంతాల్లో జ్ఞాన వెలుగులు పంచేందుకు నిరంతరం కృషి చేస్తున్న వారిని గుర్తిస్తూ అందించిన అవార్డు మరోసారి సామాజిక బాధ్యతను గుర్తు చేసింది. గ్రామీణ గ్రంథాలయాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసినందుకు అందిన ఈ గౌరవం, పుస్తకాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించే ప్రయత్నాలకు పెద్ద ప్రోత్సాహంగా నిలిచింది. ఈ సందర్భంలో మండల పరిధిలోని వెంపటి గ్రామంలో కామ్రేడ్ దాయం శశిరేఖ రాజిరెడ్డి స్మారకార్థం ఆయన కుమారుడు దాయం విక్రమ్ రెడ్డి నవంబర్ 27, 2003 ఏర్పాటు చేసిన గ్రంథాలయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాడు మాజీ ఎంపీ భీమి రెడ్డి నరసింహారెడ్డి శంకుస్థాపన చేయగా, మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం ప్రారంభించారు. నవీన యువజన సంఘం,జెవైసీ సభ్యులు సంఘటితంగా భాగస్వాములై దీనిని నిర్మించారు. తర్వాత పానుగంటి ప్రతాపరెడ్డి ఆర్థిక సహకారంతో రీడింగ్ రూమ్ ను నిర్మించారు. ప్రస్తుతం గ్రంథాలయానికి రాజిరెడ్డి–శశిరేఖ ల మనవరాలు దాయం ఝాన్సీ రాజిరెడ్డి ట్రస్ట్ చైర్మన్ గా కొనసాగుతూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళుతున్నారు. గ్రామీణ ప్రజలకు విద్య, అవగాహన, విజ్ఞానం అందించాలనే సంకల్పంతో ఈ గ్రంథాలయాన్ని మాజీ ఎంపీ భీమిరెడ్డి నరసింహారెడ్డి ప్రారంభించడం విశేషం. ఈ గ్రంథాలయం ద్వారా విద్యార్థులు, యువతకు అవసరమైన పుస్తకాలు, పోటీ పరీక్షల మెటీరియల్, సామాజిక అంశాలపై అవగాహన కలిగించే గ్రంథాలు అందుబాటులోకి రావడం గ్రామ అభివృద్ధికి దోహదపడుతోంది. ముఖ్యంగా గ్రామీణ యువతలో చదువుపై ఆసక్తి పెంచడం, ఉన్నత లక్ష్యాల వైపు దారి చూపించడం ఈ గ్రంథాలయం ముఖ్య లక్ష్యంగా కొనసాగుతోంది. స్థానిక ప్రజలు, యువజన సంఘాలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇటువంటి గ్రంథాలయాలు ప్రతి గ్రామంలో ఏర్పాటు కావాలని కోరుతున్నారు. సేవా భావంతో ముందుకు వచ్చిన నాయకులు, దాతలు మరింతగా సహకరించాలని పిలుపునిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో గ్రంథాలయ అభివృద్ధికి ఎనలేని సేవలందించిన దాయం శశిరేఖ రాజిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఝాన్సీ రాజిరెడ్డి కి భాష సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాదులోని రవీంద్ర భారతీ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ పరాభావ నామ ఉగాది పురస్కారాన్ని ప్రముఖుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ...."గ్రామీణ ప్రాంతాల్లో జ్ఞానం అందుబాటులోకి రావాలంటే గ్రంథాలయాల అభివృద్ధి అత్యంత అవసరం. నాకు లభించిన ఈ అవార్డు వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, గ్రామీణ విద్యాభివృద్ధికి చేస్తున్న ప్రతి ఒక్కరి కృషికి గుర్తింపు. కామ్రేడ్ దాయం శశిరేఖ రాజిరెడ్డి స్మారకార్థం ప్రారంభించిన ఈ గ్రంథాలయం ద్వారా మరింత మంది విద్యార్థులు, యువత చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని ఆశిస్తున్నాను. గ్రంథాలయాలు ఉన్న చోటే చైతన్యం, అభివృద్ధి ఉంటాయి. భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఇలాంటి గ్రంథాలయాలను ఏర్పాటు చేయడానికి నా వంతు కృషి కొనసాగిస్తాను" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్, తెలుగు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు కవి విమర్శకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నా మోజు బాలా చారి, ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి, విపంచి ఫౌండేషన్ గౌరవ సలహాదారు ఆందోజు నాగభూషణం, సోషల్ డెవలప్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుండ్ల మదన్, కల్లూరి సుజాత ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్,అండ్.బి అధికారులపై మండిపడుతున్న ప్రజలు

**ప్రాణాలుపోతున్న పటించుకోరా అంటూ విమర్శలు**


GOVERNMENT OF TELANGANA
ROADS AND BUILDINGS DEPARTMENT
From: ... To: ...
Lr. No: ... Dt: ...03.08.2024

**చింతపల్లి మార్చి 24(ప్రజాజ్యోతి) :** చింతపల్లి మండలంలోని సాగర్–హైదరాబాద్ రోడ్డులో జరుగుతున్న ప్రమాధాలపై చింతపల్లి మండల ప్రజలు బగ్గుమంటున్నారు.ఎవరు ఇష్టం వచ్చినట్లుగా వాళ్ళు రహదారిని ఏలాంటి అనుమతులు లేకుండా రోడ్డును ఇరువైపుల ధ్వంసంచేసి నీళ్ల పైపులు అమార్చుకుంటున్నారు. దీంతో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్న ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికుల ప్రాణాలమీదకు తెస్తుంది.ఇలాంటి సంఘటనే సోమవారం నసర్లపల్లి గ్రామ చివర్లో చోటుచేసుకుంది.ఇక వివరాల్లోకి వెళ్తే తీర్మలాపురం గ్రామానికి చెందిన జోగు వెంకటేష్ అవసరాలకు నిమిత్తం చింతపల్లి మండల కేంద్రానికి బైక్ మీద వస్తున్న తరుణంలో నసర్లపల్లి గ్రామ చివర్లో సాగర్–హైదరాబాద్ రహదారిపై ఉన్న గుంతలో పడి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంకటేష్ ని చింతపల్లి ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు.తన ప్రమాదానికి రోడ్డు ధ్వంసం చేసి రోడ్డును గుంతలుగా మార్చిన పారుబైల్ మిల్లు యజమాని మీద చింతపల్లి పోలీస్టేషన్ లో పిర్యాదు చేసిన ఫలితం లేకపోయింది. ఈ విషయంపై పూర్తి సమాచారం తెలుసుకున్న బాధితుడు జోగు వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం 2024 ఆగస్టు 3వ తేదీన ఎలాంటి అనుమతులు లేకుండా నీటి పైపుల కోసం వెంకట సాయి పారుబైల్ రైస్ మిల్లు యజమాని అక్రమంగా రోడ్డు తొవ్వడంతో అక్కడ గుంతలు ఏర్పడ్డాయన్నారు.అయితే రోడ్డు ధ్వంసం చేసిన వ్యక్తులపై కూడా పోలీస్టేషన్ లో పిర్యాదు చేసినట్లు సమాచారం.ఈ విషయాన్ని ఆర్ అండ్ బి ఉన్నతాధికారి గుట్టుచప్పుడు కాకుండా ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది.జోగు వెంకటేష్ ప్రమాదానికి గురైన స్థలంలో ఇన్నాళ్లు ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది.ఇప్పటికైనా జిల్లా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ధ్వంసం అయిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి గుంతలుగా ఏర్పడటానికి కారణమైన వ్యక్తుల మీద చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఆర్,అండ్.బి అధికారులపై మండిపడుతున్న ప్రజలు




**ప్రాణాలుపోతున్న పటించుకోరా అంటూ విమర్శలు**

**చింతపల్లి మార్చి 24(ప్రజాజ్యోతి) :** చింతపల్లి మండలంలోని సాగర్–హైదరాబాద్ రోడ్డులో జరుగుతున్న ప్రమాధాలపై చింతపల్లి మండల ప్రజలు బగ్గుమంటున్నారు.ఎవరు ఇష్టం వచ్చినట్లుగా వాళ్ళు రహదారిని ఏలాంటి అనుమతులు లేకుండా రోడ్డును ఇరువైపుల ధ్వంసంచేసి నీళ్ల పైపులు అమార్చుకుంటున్నారు. దీంతో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్న ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికుల ప్రాణాలమీదకు తెస్తుంది. ఇలాంటి సంఘటనే సోమవారం నసర్లపల్లి గ్రామ చివర్లో చోటుచేసుకుంది.ఇక వివరాల్లోకి వెళ్తే తీర్మలాపురం గ్రామానికి చెందిన జోగు వెంకటేష్ అవసరాలకు నిమిత్తం చింతపల్లి మండల కేంద్రానికి బైక్ మీద వస్తున్న తరుణంలో నసర్లపల్లి గ్రామ చివర్లో సాగర్–హైదరాబాద్ రహదారిపై ఉన్న గుంతలో పడి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంకటేష్‌ని చింతపల్లి ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు.తన ప్రమాదానికి రోడ్డు ధ్వంసం చేసి రోడ్డును గుంతలుగా మార్చిన పారుబైల్ మిల్లు యజమాని మీద చింతపల్లి పోలీస్టేషన్‌లో పిర్యాదు చేసిన ఫలితం లేకపోయింది. ఈ విషయంపై పూర్తి సమాచారం తెలుసుకున్న బాధితుడు జోగు వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం 2024 ఆగస్టు 3వ తేదీన ఎలాంటి అనుమతులు లేకుండా నీటి పైపుల కోసం వెంకట సాయి పారుబైల్ రైస్ మిల్లు యజమాని అక్రమంగా రోడ్డు తొవ్వడంతో అక్కడ గుంతలు ఏర్పడ్డాయన్నారు. అయితే రోడ్డు ధ్వంసం చేసిన వ్యక్తులపై కూడా పోలీస్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు సమాచారం.ఈ విషయాన్ని ఆర్ అండ్ బి ఉన్నతాధికారి గుట్టుచప్పుడు కాకుండా ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది.జోగు వెంకటేష్ ప్రమాదానికి గురైన స్థలంలో ఇన్నాళ్లు ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది.ఇప్పటికైనా జిల్లా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ధ్వంసం అయిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి గుంతలుగా ఏర్పడటానికి కారణమైన వ్యక్తుల మీద చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ



**మెండోరా: మార్చ్ /24 (ప్రజా జ్యోతి)** మెండోర మండలంలోని పోచంపాడ్ గ్రామంలో ఈ రోజు 58 పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. గంగాధరయ్య మరియు అసిస్టెంట్ డైరెక్టర్ డా. బస్వరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె. రాజు, ఉపసర్పంచ్ సంపంగి సతీష్, పాడి రైతులు శనిగరం వంశీ, సయ్యద్ మౌలానా, సమీర్, చందు, సాగర్ పాల్గొన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ సిబ్బంది ప్రవీణ్ (లైవ్‌స్టాక్ అసిస్టెంట్), మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంగారం తండా గ్రామ
# పంచాయతీ పరిధిలో సిసిరోడ్డు పనులకు భూమి పూజ



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి) మార్చి. 24** ఇందల్వాయి మండలంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. తాండూర్ నుంచి జై సేవాలాల్ మహారాజ్ గుడి వరకు సుమారు ఐదు లక్షల వేహంతో రోడ్డు నిర్మించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్ ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ నిర్వహించారు ఎంపీడీవో అనంతరావు హౌసింగ్ ఏఈ లహరి పంచాయతీ కార్యదర్శి సింగోటం శ్రీధర్ ఉప సర్పంచ్ ధూమ వాడు మెంబర్లు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి సిసి రోడ్ ఎంతో ఉపయోగపడుతుందని గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సభ్యులు స్థానికులు వార్డు మెంబర్లు పాల్గొని విజయవంతం చేశారు.

## గంగారం తండాలో నాలుగు
# మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమి పూజ





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) మార్చ్. 24** ఇందల్ మండలంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం 4 మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఈ ట్యాంకులను ఏర్పాటు చేయునట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో అనంతరావు హౌసింగ్ ఏఈ లహరి గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్ హాజరై భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో అనంతరావు మాట్లాడుతూ ప్రతి గల్లీలో కూడా తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రతి ఇంటికి మంచినీరు అందించేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం సర్పంచ్ సంగీత దిలీప్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఈ మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు ఎస్సీ వాడలో ఒకటి పాషా ఇంటి వద్ద ఒకటి తాండాలో ఒకటి మేదరి సంఘం సమీపంలో మరొకటి ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధూమ వార్డ్ మెంబర్లు బుజ్జి గణేష్ మమత సంధ్యారాణి బాబూలాల్ పంచాయతి సింగోటం శ్రీధర్ శ్రీను గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి
# భూమి పూజ నిర్వహించిన మండల అధ్యక్షులు నవీన్ గౌడ్





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) మార్చ్. 24** ఇందల్వాయి మండలంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు మూసుకుని నవీన్ గౌడ్ ఎంపీడీవో అనంతరావు ఏఈ లహరి హాజరై భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్ మాట్లాడుతూ పేదల ఇంటి గల నెరవేరుతున్న ఈరోజు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని పెన్షన్ లేని వారికి పెన్షన్లు రైతులకు రైతు భరోసా వంటి పథకాలు అందిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కలను నెరవేరుస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వం చేస్తున్న పనులను చూసి విమర్శలు చేయడం మానుకొని అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగీతా దిలీప్ ఉపసర్పంచ్ ధూమ వార్డ్ మెంబర్లు మమతా బుజ్జి సుధారాణి బాబూలాల్ గణేష్ పంచాయతీ కార్యదర్శి సింగోటం శ్రీధర్ శ్రీను తదితరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## ప్రపంచ టిబి
# దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు





**మెండోరా:మార్చి /24 (ప్రజా జ్యోతి):** ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా మెండోరా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారి డా. స్వాతి వినూత్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, టిబి ఒక అంటువ్యాధి అయినప్పటికీ సమయానికి గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. ముఖ్యంగా దగ్గు రెండు వారాలకు పైగా కొనసాగితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. టిబి లక్షణాలు, నివారణ మార్గాలు, ఉచితంగా అందిస్తున్న చికిత్స సేవల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న (డి ఓ టి ఎస్) చికిత్స విధానం ద్వారా రోగులు పూర్తిగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫిర్దోస్ ఫాతిమా, డాక్టర్ అరుణ(ఆయుష్), వాణి, భీమన్న, ప్రభాకర్, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొని అవగాహన పెంచుకున్నారు.

## కబ్జా కోరులకు
# బలవుతున్న పేదల ఇళ్ల పట్టాలు



**దర్పల్లి:మార్చి/ 24(ప్రజా జ్యోతి)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన రాజమణి అనే మహిళకు అప్పట్లో అంటే 2002 సంవత్సరంలో ప్రభుత్వం నీలువ నీడలే ని వారికి ఇల్ల పట్టాలిచ్చి ఆదుకోవాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నారని పట్టాలు ఇచ్చారు కానీ ఏమాత్రం డబ్బులు లేకపోవడం వలన ఎలాంటి నిర్మాణాలు చేయలేదు ఇప్పుడు ఇల్లు కట్టుకుందాం అని అక్కడవెళితే ఇ ప్లాట్ నాది అని కాంగ్రెస్ పార్టీకి చెందిన దినకర్ అనే వ్యక్తి అంటున్నారు కాళీ ఉన్న ప్లాట్లు ఆక్రమించి వేరే వారికి అమ్మినట్టు తెలుస్తోంది ఈ మధ్య ఊరంతా నిలదీస్తే నీ డబ్బులు మీకు ఇస్తానని కూడా అన్నారని తెలిసింది, ప్రభుత్వం ఇచ్చిన పట్టాలో ఇల్లు కట్టుకోవాలంటే డబ్బులు లేకుండా మూలంగా ఎటువంటి నిర్మాణం చేయలేదు. ఇప్పుడు కడదామని వెళ్తే వేరే వ్యక్తి వచ్చి అడ్డం పడు తున్నారనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నిరుపేద మహిళలకు న్యాయం జరగాలని కోరుతున్నాము

## డా బాబూ జగ్జీవన్ రామ్
# విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలి

– ఎంఆర్ పీయస్ రాష్ట్ర నాయకులు కాదేపురం గంగారాం



**బాన్సువాడ ఆర్ సి మార్చ్ 24 (ప్రజా జ్యోతి)** బీర్కూర్ మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామంలో భారత దేశ మాజీ ఉప ప్రధాన మంత్రి, సంఘ సంస్కర్త, స్వతంత్ర సమరయోధులు డా. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(మాదిగ దండోరా) రాష్ట్ర నాయకులు కాదేపురం గంగారాం అన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో ఈ విషయమై గ్రామ సర్పంచ్ రెంజర్ల అనీల్ కు మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన జరిగే అయన జయంతి ఉత్సవ వేడుకలను బరంగ్ ఏడ్గి గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఆ రోజున అయన విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాచకొండ బాలయ్య, అన్నం అనీల్, లక్కపల్లి హన్మాండ్లు, మాజీ ఎంపీటీసీ బోయి లాలయ్య, నాయకులు బోయి లాలయ్య, రాచకొండ గంగారాం, బోయి చిన్న సాయిలు, టేకుర్ల గంగారాం, రాచకొండ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష సెంటర్లను సందర్శించిన
# విద్యార్థి సంఘం నాయకులు మావురం శ్రీకాంత్





**బాన్సువాడ ఆర్ సి మార్చ్ 24ప్రజా జ్యోతి** బాన్సువాడ ఆర్ సి/నస్రుల్లాబాద్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తెలంగాణ స్టూడెంట్ పరిషత్ జిల్లా అధ్యక్షులు మావురం శ్రీకాంత్, మంగళవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ నసురుల్లాబాద్ మండలంలోని నెమలి హైస్కూల్లో పదవ తరగతి పరీక్ష ల సమయంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష సెంటర్ల లో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, గర్ల్స్ హైస్కూల్ ఐదు పరీక్ష కేంద్రాలలో నిర్వహిస్తున్నటువంటి పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా మవురం శ్రీకాంత్ మాట్లాడుతూ, విద్యార్థు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఒ పత్రిక ప్రకటనలో తెలిపారు.

# ఏజెన్సీ గ్యాస్ అక్రమ దందా బహిర్గతం

– 14 కేజీ సిలిండర్‌ను రెండు సిలిండర్లుగా మార్పిడి

– ఒక్కో సిలిండర్‌పై రూ.4000 వరకు అక్రమ వసూళ్లు






**బాన్సువాడ ఆర్‌సి, మార్చ్ 24 (ప్రజా జ్యోతి)** బాన్సువాడ ,నిజాం సాగర్ ప్రాంతంలో గ్యాస్ ఏజెన్సీకి సంబంధించిన అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ కొరత ఉందన్న వదంతులను ఆసరాగా చేసుకుని కొంతమంది ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారులను మోసం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల ప్రకారం, 14 కిలోల గ్యాస్ సిలిండర్‌ను అక్రమంగా రెండు చిన్న సిలిండర్లలోకి మార్చి, వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఒక్కో సిలిండర్‌పై సుమారు రూ.4000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని స్థానికులు తెలిపారు. సిలిండర్లు లేవని చెప్పి, డబుల్ రేట్లకు విక్రయించడం ద్వారా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టపగలే ఈ అక్రమ వ్యవహారం జరుగుతుండటంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నరసన్నపల్లి గ్రామంలో ఇంద్రమ్మ
# ఇండ్లను సందర్శించిన ఎంపీ ఓ త్రివేద్ సర్పంచ్ రసమోల్ల రవి

**కామారెడ్డి రూరల్, మార్చి 24 (ప్రజా జ్యోతి):** కామారెడ్డి మండలం నరసన్నపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇంద్రమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు మొదటి విడత ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరు పత్రాలను ఈరోజు పంపిణీ చేశారు. అదే సమయంలో గృహ నిర్మాణ ప్రక్రియలో భాగంగా బేస్మెంట్ దశ పూర్తయిన ఇళ్లకు సంబంధించిన ఫోటోలను అధికారులు సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పథకం నిబంధనల ప్రకారం ప్రతి దశలో పనుల పురోగతిని పరిశీలిస్తూ, తదుపరి విడత నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. బేస్మెంట్ పనులు పూర్తి చేసిన లబ్ధిదారులు తదుపరి దశల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఎంపీవో త్రివేద్, గ్రామ సర్పంచ్ రవి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల గృహ స్వప్నాన్ని నిజం చేయడంలో ఇంద్రమ్మ ఇళ్ల పథకం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజశేఖర్, గ్రామ పంచాయతీ సెక్రటరీ, వార్డు సభ్యులు, కారోబార్, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న సహాయంపై హర్షం వ్యక్తం చేస్తూ, తమ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. గ్రామంలోని ప్రతి అర్హ కుటుంబం సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.



## పశువులకు ఉచిత
# గాలికుంటు నివారణ టీకాలు



**మోర్తాడ్ మార్చ్ 24(ప్రజా జ్యోతి)** మోర్తాడ్ మండలంలోని డోనపాల్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటూ నివారణ టీకాలను ఇవ్వడం జరిగిందని మండల పశు వైద్య అధికారి డాక్టర్ గౌతమ్ రాజు తెలిపారు. పాడి రైతులు పశువులకు ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాములు గ్రామసర్పంచ్ బాజమ్మ ఉపసర్పంచ్ సాయికుమార్ వీడీసి పాడి రైతులు పర్సా రాజేందర్ శ్రీనివాస్ గౌడ్ రేసం రాజేందర్ అశోక్ రమేష్ దేవేందర్ దేవీదాస్ సిబ్బంది ప్రభాకర్ ప్రభాస్ పాల్గొన్నారు.

# గర్గుల్‌లో ఉచిత మెడికల్ క్యాంపు

– సర్పంచ్ చింతల దివ్య రవితేజ గౌడ్

– ఆధ్వర్యంలో ప్రజలకు విశేష సేవలు

– ఆరోగ్యంపై అవగాహన పెంపుకు వైద్యుల సూచనలు

-- గ్రామ ప్రజల భారీ స్పందన





**కామారెడ్డి రూరల్, మార్చి 24 (ప్రజా జ్యోతి):** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో గర్గుల్ గ్రామంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపు అత్యంత విజయవంతంగా నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ప్రజల ఆరోగ్య పరిస్థితులను మెరుగుపర్చాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపులో ఉదయం నుంచే గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2:00 గంటల వరకు కొనసాగి వందలాది మంది ప్రజలకు వైద్య సేవలు అందించింది. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చింతల దివ్య రవితేజ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై క్యాంపును ప్రారంభించి, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించే అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్య సమస్యలు తరచూ పట్టించుకోకుండా వదిలేయడం వల్ల అవి తీవ్రమవుతున్నాయని, అందుకే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను గ్రామ స్థాయిలో నిర్వహించడం చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రజలు చిన్న సమస్యలనే పెద్ద వ్యాధులుగా మారకముందే వైద్యులను సంప్రదించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. క్యాంపులో అనుభవజ్ఞులైన నిపుణుల బృందం పాల్గొని గ్రామ ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించింది. బీపీ, షుగర్ వంటి ప్రాథమిక పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు ప్రతి ఒక్కరి ఆరోగ్య స్థితిని సమగ్రంగా పరిశీలించారు. వయోవృద్ధులు ఎక్కువగా ఎదుర్కొనే మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, కీళ్ల సమస్యలకు ప్రత్యేక చికిత్సలు అందించారు. అలాగే దగ్గు, దమ్ము, జ్వరం, తలనొప్పి, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఆకలి లేకపోవడం, సర్ది, చర్మ వ్యాధులు వంటి అనేక సమస్యలకు సంబంధించిన చికిత్సలు అందించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా సలహాలు ఇచ్చి, సరైన చికిత్స పద్ధతులను వివరించారు. ఈ క్యాంపులో చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. పిల్లల్లో సాధారణంగా కనిపించే పోషకాహార లోపాలు, జ్వరాలు, జలుబు వంటి సమస్యలకు చికిత్సలు అందించారు. అలాగే రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, యువతులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన ఔషధాలు పంపిణీ చేశారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు వైద్యులు ప్రత్యేక సూచనలు చేశారు. వైద్యుల బృందం అవసరమైతే రక్తపరీక్షలు, ఎక్స్‌రేలు, స్కానింగ్‌లు చేయించుకోవాలని సూచిస్తూ, కొన్ని తీవ్రమైన కేసులను గుర్తించి తదుపరి పరీక్షల కోసం ఆసుపత్రికి రిఫర్ చేశారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి ఆధునిక పరీక్షలు అవసరమైన రోగులను ఎంపిక చేసి, వారికి ఆసుపత్రిలో ఉచితంగా సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అవసరమైన శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా నిర్వహించే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య అవగాహనపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సమతుల్య ఆహారం, వ్యాయామం, నీటి వినియోగం, కాలానుగుణ వ్యాధుల నివారణ వంటి అంశాలపై వైద్యులు ప్రజలకు విస్తృతంగా వివరించారు. ముఖ్యంగా వేసవి కాలం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. గ్రామంలో ఈ క్యాంపు నిర్వహించడంలో గ్రామపంచాయతీ ముఖ్య పాత్ర పోషించింది. గ్రామ సర్పంచ్ చింతల దివ్య రవితేజ గౌడ్ సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది. గ్రామ పాలకవర్గ సభ్యులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల నాయకులు, యువకులు, స్వచ్ఛంద సేవకులు చురుకుగా పాల్గొని క్యాంపు నిర్వహణలో సహకరించారు. క్యాంపుకు హాజరైన గ్రామ ప్రజలు ఉచితంగా అందించిన వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఇలాంటి సేవలు మరింతగా అందించాలని కోరారు. చాలా మంది రోగులు తమ ఆరోగ్య సమస్యలకు తక్షణ పరిష్కారం లభించడంతో సంతోషం వ్యక్తం చేశారు. మొత్తంగా గర్గుల్ గ్రామంలో నిర్వహించిన ఈ ఉచిత మెడికల్ క్యాంపు గ్రామ ప్రజలకు ఆరోగ్య పరిరక్షణలో ఒక మైలురాయిగా నిలిచింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు గ్రామపంచాయతీ కృషి చేస్తుందని సర్పంచ్ తెలిపారు.

# తూప్రాన్ బైపాస్‌లో ఆటో బోల్తా

– 13 మంది కూలీలకు గాయాలు




తూప్రాన్ ప్రజాజ్యోతి మార్చ్ 24 తూప్రాన్ బైపాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై కూలీలతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురై బోల్తా పడింది. ఈ ఘటనలో మొత్తం 13 మంది మహిళా కూలీలు గాయపడ్డారు. పోలీసుల సమాచారం మేరకు, మసాయిపేట మండలం పోతిన్‌పల్లి గ్రామానికి చెందిన కూలీలు సంబెల్ సీడ్ కంపెనీలో పనికి వెళు్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గంగారాజు తెలిపారు.

# హామీలు అమలు చేయాలి

– బీఆర్ఎస్వీ డిమాండ్

– అసెంబ్లీ ముట్టడి ముందే బీఆర్ఎస్వీ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు




తూప్రాన్ ప్రజాజ్యోతి మార్చ్ 24: అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో బిఆర్ఎస్వి నేతలపై పోలీసులు ముందస్తు చర్యలకు దిగారు. తూప్రాన్ మున్సిపల్ టిఆర్ఎస్వి అధ్యక్షుడు నాని వెంకట్, యూత్ నాయకుడు శ్రీకాంత్‌లను తెల్లవారుజామునే తూప్రాన్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంగళవారం నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడికి సిద్ధమైన విద్యార్థి నాయకత్వాన్ని అడ్డుకోవడమే ఈ అరెస్టుల వెనుక కారణమని సమాచారం. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి నాయకులు మండిపడ్డారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన 15% విద్యా నిధులు, 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, స్కాలర్షిప్‌లు, విద్యార్థినిలకు స్కూటీలు, భరోసా కార్డు వంటి కీలక హామీలను బడ్జెట్‌లో పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా పోరాటం చేయాలనుకున్న విద్యార్థులను ముందుగానే అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు ఆరోపించారు. హామీలు అమలు అయ్యే వరకు పోరాటం ఆగదని, విద్యార్థుల కోసం మా గళం నిరంతరం వినిపిస్తూనే ఉంటుందని వెంకట్ స్పష్టం చేశారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి: ఎస్సై చైతన్య కిరణ్




రాయికోడ్ మార్చి 24 (ప్రజా జ్యోతి) స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు ఈ నెల 28న నిర్వహించబడనున్న జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని ఎస్సై చైతన్య కిరణ్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వర పరిష్కారం చేసుకునేందుకు ఇది మంచి అవకాశం అని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ చలాన్లు, చిన్నపాటి క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు, కుటుంబ సంబంధిత సమస్యలు వంటి అంశాలను పరస్పర ఒప్పందంతో సులభంగా పరిష్కరించుకునే వీలుందని చెప్పారు. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు కూడా త్వరగా పరిష్కారం పొందవచ్చని వివరించారు. ప్రజలు న్యాయవాదులు, పోలీస్ అధికారులు మరియు సంబంధిత అధికారులను సంప్రదించి తమ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. సమయం, ధనం ఆదా చేసుకోవడానికి ఇది ఉత్తమ వేదిక అని తెలిపారు.

# స్నేహపూర్వక పరిష్కారానికి లోక్ అదాలత్

– పరస్పర అంగీకారంతో పరిష్కారం సులభం – తూప్రాన్ డీఎస్పి నరేందర్ గౌడ్



తూప్రాన్ ప్రజాజ్యోతి మార్చ్ 24: ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వివాదాల పరిష్కారానికి ఇది గోల్డెన్ అవకాశమని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న వివాదాలను వేగంగా, సులభంగా పరిష్కరించుకునేందుకు ఇది ఉత్తమ వేదిక అని తెలిపారు. కోర్టుల్లో సంవత్సరాలుగా కొనసాగుతున్న కేసులు లోక్ అదాలత్ ద్వారా తక్కువ సమయంలో పరిష్కారం పొందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కుటుంబ వివాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, చిన్నపాటి క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ చలాన్లు ఇలాంటి అనేక కేసులను పరస్పర అంగీకారంతో సులభంగా పరిష్కరించుకోవచ్చని వివరించారు. ముఖ్యంగా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులకు కోర్టు ఫీజులు తిరిగి పొందే అవకాశం ఉండటంతో పాటు, తీర్పు తుది నిర్ణయంగా అమలవుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వివాదాలను లాగడాన్ని మానుకుని, స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవడానికి ఇది మంచి అవకాశమని డీఎస్పీ సూచించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం పొందాలని కోరారు.

# క్షయ రహిత మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలి

– ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



మెదక్ (ప్రజాజ్యోతి ) మార్చి 24: ఒక్షయ వ్యాధి (టీబీ) నివారణ పైన అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0 అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు. సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. క్షయవ్యాధి (టీబీ) నియంత్రణలో ముందస్తు గుర్తింపు, స్క్రీనింగ్, ప్రజల్లో అవగాహన పెంపు పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. మొదటగా అధిక జనాభా గల ప్రాంతంలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి నాట్, మైక్రోస్కోపీ, ఎక్స్–రే ద్వారా నిర్ధారణకు పంపాలని అధికారులకు సూచించారు. డయాబెటిస్, పోషకాహార లోపం, వృద్ధులు ఇతర సహ వ్యాధులు ఉన్నవారిని ప్రాధాన్యంగా స్క్రీనింగ్ చేయాలని, అన్ని కేసులను నిక్ష్య పోర్టల్ లో నమోదు చేయాలన్నారు.



# సీతారామ కళ్యాణ వేడుకలకు సిద్ధమవుతున్న విట్టలేశ్వర స్వామి ఆలయం

– నూతన కమిటీతో పురాతన దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలకు కొత్త ఊపు




వెల్దుర్తి ప్రజాజ్యోతి మార్చ్ 24: వెల్దుర్తి పట్టణంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ విట్టలేశ్వర స్వామి దేవాలయం ఈనెల 27న జరగబోయే శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబ్ అవుతోంది. ఈ సందర్భంగా దేవాలయ నూతన కమిటీ భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టి, భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తోంది. ఈ దేవాలయం ప్రాంతంలో పురాతన చరిత్ర కలిగిన పవిత్రక్షేత్రంగా పేరుగాంచింది. స్థానికుల నమ్మకాల ప్రకారం, శ్రీ విట్టలేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తుల కోరికలు నెరవేరుతాయని విశ్వాసం ఉంది. అందుకే ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా వేలాది మంది భక్తులు ఇక్కడికి తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందుతుంటారు. ఈ ఏడాది వేడుకలను మరింత వైభవంగా నిర్వహించేందుకు నూతన కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడం, భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు, తాగునీరు, అన్నదానం వంటి సౌకర్యాలు భక్తుల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించనున్నారు. పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు శ్రీరామనవమి సందర్భంగా జరిగే సీతారామ కళ్యాణ మహోత్సవం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ కార్యక్రమాన్ని కనుల పండుగలా నిర్వహించేందుకు కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ దేవాలయానికి అపారమైన మహిమలు ఉన్నాయి. స్వామివారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకుంటే మనసులో కోరుకున్న కోరికలు నెరవేరుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారని భావిస్తున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేస్తున్నామని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఈ పవిత్ర వేడుకలను విజయవంతం చేయాలని కమిటీ పిలుపునిచ్చింది.

# అనుమతులు లేకుండానే వెంచర్ ఏర్పాటుకు సిద్ధం




- వెంచర్ ఏర్పాటుకు అడ్డుగా ఉన్నాయని వందల ఎకరాల్లో చెట్లు తొలగింపు
- ఇంతలా జరుగుతుంటే ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యం ఎందుకు?
- తొలగించిన చెట్లను వాగులోకి తోసివేత
- వాగులు కాలువలు మూసి వేయడానికి సర్వం సిద్ధం
- ఇరిగేషన్ అధికారులు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి
- ప్రధాన రహదారి పక్కనే అక్రమాలు
- ఒక ఎకరా ఐదు కోట్ల విలువైన భూమి
- అసంపూర్తిగా నాలా కన్వర్షన్.
- మన్సాన్పల్లి గ్రామ శివారులో సంఘటన






కొండాపూర్ ప్రజా జ్యోతి రిపోర్టర్ శేఖర్

కొండాపూర్ ప్రజా జ్యోతి మండల పరిధిలోని మన్సాన్పల్లి లో ఓ వెంచర్ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. మొట్టమొదట వెంచర్ ఏర్పాటు చేయాలంటే మొట్టమొదటిగా నాలా కన్వర్షన్ చేసుకొని ఫారెస్ట్ అధికారుల అనుమతులతో రోడ్లకు, ప్లాట్లకు ఇబ్బందిగా ఉన్న చెట్లను తొలగించడానికి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కేవలం నాలా కన్వర్షన్ అసంపూర్తిగా అగ్రికల్చర్ భూముల్లో కూడా జెసిబి, ట్రాక్టర్లతో భూమి లెవెలింగ్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలు పక్కనపెట్టి వారంతట వారు వందల ఎకరాల్లో వేప, తుమ్మ చెట్లను పీకి నరికి వేశారు.

**ఫారెస్ట్ అధికారుల వివరణ**

మేము చెట్లు తొలగించడానికి ఇలాంటి అనుమతులు ఇవ్వలేము. అనుమతులు లేకుండా చెట్లు తొలగించిన వారిపై తగు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జెసిబిలతో చెట్లను పికి వాగుల్లోకి నెట్టేశారుమరో నెల అయితే వచ్చేది వర్షాకాలం వెంచర్కు ఏర్పాటయితున్న భూమిలో సుమారు రెండు పెద్ద వాగులు నాలుగు చిన్నవాగులు ఉంటాయి. చిన్న వాటిని పూర్తిగా మూసేశారు. పెద్దవాగులను పూడ్చుడానికి సిద్ధంగా ఉన్నారు.

**వాగు ఓవైపు ఉంటే మరోవైపు నక్ష తింపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు**

ఇంతలా అక్రమాలు జరుగుతుంటే ఇరిగేషన్ అధికారులు తమకు ఎలాంటి సంబంధం లేనట్లుగా ఉన్నారు. వివరణ కోసం కాల్ చేయగా మాకేం తెలియదు మేము ఆ సర్వే నెంబర్లలోకి వెళ్లలేము అని సమాధానం ఇచ్చారు. వాగులు, కాలువలు, కుంటలు కబ్జా చేస్తే తప్పకుండా వారిపై తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. సర్వే నెంబర్లు 36, 37, 42, 43, 44, 47, 48, 49, 50, 51, 52, 53, 54, 80, 81, 82, 83, 84, 85. మండల పరిధిలోని మన్సాన్పల్లి గ్రామ ఈ సర్వే నెంబర్లు శుభ గృహ ప్రాజెక్టు లిమిటెడ్ ఆర్ ఈ పి. జె శ్రీనివాస్, విస్సెల్ పార్క్ ల్యాండ్ డెవలపర్స్ బి.వి నరసింహారావు తో పాటు మిగతా వ్యక్తులపై, కంపెనీలపై భూమి రిజిస్టర్ చేసి ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి వాగులు, కుంటలు, కాలువలను కాపాడవలసిన బాధ్యత ఇరిగేషన్ అధికారులకు ఉంటుంది. అనుమతులు లేకుండా అనేక చెట్లు తొలగించిన వారిపై తగు చర్యలు తీసుకుంటారో లేదో చూడాల్సి ఉంది.

# అసెంబ్లీ ముట్టడికి ముందే బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టులు

– విద్యార్థి హామీల అమలు కోసం ఆందోళన – ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు



కొమురవెల్లి, మార్చి 24(ప్రజా జ్యోతి):– బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో కొమురవెల్లి మండలానికి చెందిన బిఆర్ఎస్వి నాయకులను పోలీసులు తెల్లవారుజామున వారి నివాసాల వద్ద అదుపులోకి తీసుకుని కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సీనియర్ నాయకులు ఏర్పుల మహేష్‌ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని బిఆర్ఎస్వి నాయకులు తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన 15% విద్యా నిధులు, 2 లక్షల ఉద్యోగాలు, విద్యా భరోసా కార్డు, నిరుద్యోగ భృతి, స్కాలర్షిప్‌ల విడుదలతో పాటు విద్యార్థినులకు స్కూటీలు అందజేస్తామని హామీ ఇచ్చినా, వాటిని బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం విద్యార్థుల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీసిందన్నారు. ఈ హామీల అమలు కోసం శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడి చేపట్టాలని నిర్ణయించుకున్న విద్యార్థి నాయకులను ప్రభుత్వం ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థి ఉద్యమాలను అణచివేయడానికి పోలీసులు వినియోగించడం ద్వారా రేవంత్ సర్కార్ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

# ఇందూర్‌లో యంత్రప్రజ్ఞ




సిద్దిపేట అర్బన్, మార్చి 24, (ప్రజాజ్యోతి): ఇందూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో యంత్రప్రజ్ఞ -- ప్రాజెక్ట్ ఎక్స్‌పో 2026ను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.పి. రాజు తెలిపారు. ఈ ఎక్స్‌పో బీటెక్ , డిప్లమా విద్యార్థులు తమ సృజనాత్మకతతో పాటు సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించేందుకు మంచి వేదికగా నిలిచింది. మొత్తం 37 టీమ్స్ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. విద్యార్థులు హార్డ్‌వేర్ , సాఫ్ట్‌వేర్ విభాగాలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. హార్డ్‌వేర్ విభాగంలో ఐ ఓ టి, రోబోటిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఆటోమేషన్ వంటి ప్రాజెక్టులు ఉండగా, సాఫ్ట్‌వేర్ విభాగంలో ఏఐ/ఎం ఎల్ , వెబ్ ద మొబైల్ అప్లికేషన్స్, డేటా అనలిటిక్స్, సిమ్యులేషన్స్ వంటి ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి 3000 రూపాయలు , రెండో బహుమతి 2000 రూపాయలు , మూడో బహుమతి 1000 రూపాయలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ ప్రాజెక్టులను నిపుణుల జడ్జింగ్ ప్యానెల్ ముందు ప్రదర్శించే అవకాశం పొందడంతో పాటు, ప్రాక్టికల్ మరియు ప్రెజెంటేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ మల్లేశం, డాక్టర్ పద్మావతి, ఎల్.ఎన్. రావు, సుజిత్, వి. శీను, బి. శ్రీకాంత్, కె. కిరణ్మయి, లతా, సంతోషి, వినోద, స్నేహలత, పిఆర్ఓ బొద్దు రఘు పాల్గొన్నారు. స్టూడెంట్ కోఆర్డినేటర్స్‌గా ఎం.ఏ. అఫాన్, ఎం.డి. ఫర్హానుద్దీన్ సేవలు అందించారు.

# పరిగి మున్సిపల్‌ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

**చైర్ పర్సన్ రజిత వెంకటేష్**



**పరిగి, మార్చి 24 (ప్రజాజ్యోతి):** పరిగి పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ తెలిపారు. పట్టణంలో మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఉన్న వీధి దీపాలను హైడ్రా క్రేన్ సహాయంతో మరమ్మత్తులు చేయించడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజ్ రోడ్‌లోని పెద్ద స్తంభాలను పరిశీలించి మరమ్మత్తులు పూర్తి చేసినట్లు చెప్పారు. అదేవిధంగా, మిగిలిన వార్డులలో కూడా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసి పట్టణం మొత్తం విద్యుత్ వెలుగులతో ప్రకాశించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సహకారంతో ఇప్పటికే పలు వార్డుల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు, ఇంకా అవసరమైన ప్రాంతాల్లో కొత్త లైట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరిగి పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, అందరి భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ తెలిపారు.

# డాక్టర్ స్నిగ్ధ గౌడ్‌కు డెంటల్ ఆస్కార్ అవార్డు







**శేరిలింగంపల్లి,మార్చి 24 (ప్రజాజ్యోతి):** దంత వైద్య రంగంలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పుతున్న డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్స్ చైర్‌పర్సన్ డాక్టర్ స్నిగ్ధ గౌడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ముంబయిలో నిర్వహించిన ఫామ్‌డెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ఆమెను అలైనర్ స్పెషలిస్ట్ ఆఫ్ ది ఇయర్' పురస్కారంతో సత్కరించారు. భారతదేశంలో 'డెంటల్ ఆస్కార్స్'గా పిలవబడే ఈ వేడుకలో తెలంగాణ నుంచి ఈ విశిష్ట గుర్తింపు పొందిన ఏకైక ఆర్థోడాంటిస్ట్‌గా ఆమె నిలిచి సరికొత్త రికార్డు సృష్టించారు. 25 ఏళ్లకు పైగా అనుభవం, ఆధునిక హైబ్రిడ్ ఆర్థోడాంటిక్ మెకానిక్స్ లో ఆమె చూపిన ప్రతిభ ఈ అవార్డుకు ఆమెను ఎంపిక చేసేలా చేశాయి. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ) గ్రాడ్యుయేట్, ప్రఖ్యాత 10,000 ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ లో గుర్తింపు పొందిన నాయకురాలిగా,డాక్టర్ స్నిగ్ధ తన వ్యాపార నైపుణ్యాన్ని, వైద్య నైపుణ్యాన్ని కలగలిపి ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రముఖంగా ఎదిగారు. 25 ఏళ్లకు పైగా క్లినికల్ అనుభవం ఉన్న ఆమె, అడ్వాన్స్‌డ్ ఆర్థోడాంటిక్స్‌లో నిపుణురాలు. అలైనర్లను ఫిక్స్‌డ్ టెక్నిక్స్‌తో కలిపి చికిత్స చేసే హైబ్రిడ్ ఆర్థోడాంటిక్ మెకానిక్స్ లో ఆమె సిద్ధహస్తులు.అత్యంత క్లిష్టమైన ఆర్థోడాంటిక్ కేసులను కూడా ఆధునిక అలైనర్ థెరపీ ద్వారా పరిష్కరిస్తూ.. స్మైల్ డిజైనింగ్‌లో కొత్త ప్రమాణాలు నెలకొల్పుతున్నారు. దంత వైద్య రంగంలో ఆమె చూపిస్తున్న నిరంతర ఆవిష్కరణలు ఆమెను ఆధునిక ఆర్థోడాంటిక్స్‌లో అగ్రగామిగా నిలబెట్టాయి.ఆమె సాధించిన విజయాల జాబితాలో మరొక విశేషం ఏమిటంటే, డాక్టర్ స్నిగ్ధ గౌడ్ వరుసగా మూడు సార్లు (2023, 2024, 2025) ఇన్విజలైన్ ప్లాటినం ప్రొవైడర్‌గా నిలిచారు.ఈ ఘనత సాధించిన ఏకైక మహిళా ఆర్థోడాంటిస్ట్ ఆమె కావడం విశేషం.ఇది ఆమె వైద్య నైపుణ్యాన్ని, రోగులకు ఆమెపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గుర్తింపు మా రోగులు మాపై ఉంచిన నమ్మకానికి, మా బృందం అంకితభావానికి నిదర్శనమన్నారు. ఆర్థోడాంటిక్స్ అంటే కేవలం పళ్ళను అమర్చడం మాత్రమే కాదని, కచ్చితత్వం, శ్రద్ధతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమని తెలిపారు.

# ఆర్టీసి రక్షణ -కార్మికుల హక్కుల పరిరక్షణకై ఐక్యంగా ఉద్యమించాలి

- **విద్యుత్ బస్సుల విధానంలో మార్పు చేసి వాటిని ఆర్టీసిలకు కేటాయించాలి**
- **2021,2025 సంవత్సరం వేతన సవరణ చేయాలి**
- **సిఐటియు జిల్లా అధ్యక్షులు జాజాల రుద్రకుమార్**
- **సీఐటీయూ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ బస్ డిపో ముందు ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా,ఆందోళన**



**రాజేంద్రనగర్, మార్చి 24 (ప్రజా జ్యోతి) :** ప్రభుత్వ విద్యుత్ బస్ విధానంలో మార్పులు చేసి వాటిని ఆర్టీసీ లకు ఇవ్వాలని, ఆర్టీసీ రక్షణ –కార్మికుల హక్కుల పరిరక్షణ' కోసం కార్మికులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జాజాల రుద్రకుమార్ అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ బస్ డిపో ముందు ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా,ఆందోళన. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ విద్యుత్ బస్సులను ఆర్టీసీ కేటాయించాలని విద్యుత్ బస్ కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్, ఆర్టీసిలె నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్ ల విధానంలో మార్పులు చేయాలని డిమాండు చేశారు. కార్మికుల ఉద్యోగ భద్రత,విద్యుత్ బస్ ల విధానాల్లో మార్పు కేంద్ర ప్రభుత్వ విధానంలో మార్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయకపోగా, ప్రయివేటు విద్యుత్ ల ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యుత్ బస్ సమకూర్చుకొంటున్నది అన్నారు. విధానంలో జరగకుండా, ఆర్టీసీలు తమ మనుగడ సాగించడం కష్టమని ఉద్యోగులకు ముప్పు వస్తుందన్నారు. విద్యుత్ బస్ ల విధానంలో మార్పు కోసం ఆర్టీసిలోని అన్ని కార్మిక సంఘాలు సమైక్య ఆందోళనకు ముందుకు రావాల్సి వుంటుందని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ హైదరాబాద్ రివిజన్ కార్యదర్శి కృష్ణ, సిఐటియు రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పిసికే భాస్కర్. జిల్లా నాయకులు రాజు, మల్లేష్, వెంకటేష్ గౌడ్, డిపో ఉద్యోగులు కార్మికులు చంద్రయ్య,గఫార్,అంజయ్య,రవి,వెంకటేష్, అర్జున్,రాజయ్య,అక్సర్, యాదయ్య,రాము,కిరణ్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**సిరిగిరిపురం గ్రామ సర్పంచ్ కృష్ణవేణి శ్రీను**



**మహేశ్వరం, మార్చ్ 23, (ప్రజా జ్యోతి) :** ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిరిగిరిపురం గ్రామ సర్పంచి కృష్ణవేణి శీను, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించి, పాఠశాల ముందస్తు బడిబాట కార్యక్రమ కరపత్రాలను, బ్రోచర్లను ఉపాధ్యా యుల, గ్రామ పాలకవర్గ సమక్షంలో ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తయారు చేశామని, పాఠశాలకు ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో ఉంటాయని ఈ సంద ర్భంగా సర్పంచ్ హామీ ఇచ్చారు.పాఠశాలకు వచ్చే పేద మధ్య తరగతి విద్యార్థు లకు నాణ్యమైన గుణాత్మమైన విద్యను అందించాలని ఈ సందర్భంగా ఉపాధ్యా యులకు పలు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిరిగిరిపురం గ్రామ పాలకవర్గం, పంచాయతీ సెక్రెటరీ పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

## పరిగి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా

# పునఃసమీక్షకు చర్యలు వేగవంతం..





### - ఎస్ఐఆర్‌పై శిక్షణ కార్యక్రమం

**పరిగి, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** పరిగి నియోజకవర్గం పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునఃసమీక్ష (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల నమోదు అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా ఎలక్టోరల్ మ్యాపింగ్, అలాగే సహాయ ఎన్నికల నమోదు అధికారులు, తహసీల్దార్లు, పరిగి, దోమ మండలాలకు చెందిన బూత్ లెవల్ అధికారులు అలాగే బూత్ లెవల్ ఏజెంట్లకు సూపర్ వైజర్ లకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి వికారాబాద్ డివిజన్ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఇఆర్ఓ) & ఆర్‌డీఓ వాసుచంద్ర హాజరై, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునఃసమీక్ష ప్రక్రియలో పాటించాల్సిన విధానాలపై బిఎల్ఓ లకు సూచనలు చేశారు. ఈ ప్రక్రియ ను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వాన్ని పెంచడం, కొత్త ఓటర్ల నమోదు, తప్పులు సవరించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ సజావుగా పూర్తికావడానికి సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల నమోదు అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఇఆర్ఓ & పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనిల్ బాబు, దోమ మండల డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, ఆర్ఐ దివ్యతో పాటు బిఎల్ఓలు, బిఎల్ఏలు సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

# మహిళల భద్రత కోసం షీ టీం ప్రత్యేక చర్యలు







### - సబ్‌డివిజన్ షీ టీం ఇంచార్జ్ నర్సిములు

**కొడంగల్, మార్చి 24 ప్రజా జ్యోతి :** మహిళలు, బాలికల భద్రతను పరిరక్షించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న షీ టీం సమర్థవంతంగా సేవలందిస్తోందని పరిగి సబ్‌డివిజన్ షీ టీం ఇంచార్జ్ నర్సిములు అన్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు పరిగి డిఎస్పీ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రారం జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పరిగి సబ్‌డివిజన్ షీ టీం ఇంచార్జ్ నర్సిములు ఆద్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, డయల్ 100, షీ టీం హెల్ప్‌లైన్ 181, సీసీ కెమెరాల ప్రాముఖ్యత వంటి విషయాలను వివరించారు. అలాగే బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం అలాగే సైబర్ నేరాలపై (హెల్ప్‌లైన్ నం. 1930) సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతా దేవి అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీ టీం సభ్యులు సావిత్రి, శోభ పాల్గొన్నారు.

# ఆస్తి వివాదం రగిల్చిన విషాదం

- తండ్రి కుటుంబంపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కుమారుడు..
- ముగ్గురికి తీవ్ర గాయాలు




**పరిగి, మార్చి 24 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా పరిగి మండలం రూప్ సింగ్ తాండలో ఆస్తి వివాదం దారుణానికి దారితీసింది. తండ్రితోపాటు కుటుంబ సభ్యులపై పెట్రోల్, డీజిల్ పోసి నిప్పంటించిన ఘటనలో ముగ్గురికి తీవ్ర కాలిన గాయాలు కాగా, మరోకరికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మార్చి 24వ తేదీ అర్ధరాత్రి సుమారు 1 గంట సమయంలో డయల్ 100కు సమాచారం అందడంతో వెంటనే పోలీసులు ఘటనాస్థలమైన రూప్ సింగ్ తాండకు చేరుకున్నారు. అక్కడ నేనావత్ హన్మంతు తన కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అతని పెద్ద భార్య కొడుకు నేనావత్ అనార్ సింగ్ ఇంటి పైకప్పు రంధ్రం ద్వారా పెట్రోల్, డీజిల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో నేనావత్ హన్మంతు, అతని భార్య నేనావత్ రమణి బాయి, కుమారుడు నేనావత్ వెంకటేష్ తీవ్రంగా కాలిన గాయాలకు గురయ్యారు. మరో కుమారుడు నేనావత్ శివకు స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితుల అరుపులు విని గ్రామస్తులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పి, గాయపడిన వారిని బయటకు తీసి 108 అంబులెన్స్ ద్వారా పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు పంపించారు. బాధితుడు నేనావత్ శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా తెలిసినది ఏమనగా, హన్మంతుకు ఇద్దరు భార్యలు ఉండగా, పెద్ద భార్య నాతి బాయి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. ఆమె పేరుమీద ఉన్న భూమికి సంబంధించిన రైతు భీమా డబ్బులు హన్మంతుకు వచ్చాయి. ఈ డబ్బులు అలాగే భూమిలో తన వాటా ఇవ్వాలని అనార్ సింగ్ పలుమార్లు అడిగినా, తండ్రి కుటుంబం నిరాకరించడంతో ఆస్తి వివాదం తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో మార్చి 23న సాయంత్రం బొంరాస్పేట పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసిన అనార్ సింగ్, అర్ధరాత్రి సమయంలో ఇంటి తలుపులను బయట నుంచి గడియపెట్టి, కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగానే నిప్పంటించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితుడు నేనావత్ అనార్ సింగ్ (34) రూప్ సింగ్ తాండ నివాసిను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దర్యాప్తు పరిగి డీఎస్పీ యన్. శ్రీనివాస్, సీఐ యస్. శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో, ఎస్ఐ బి. మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. కుటుంబ, ఆస్తి వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, క్షణికావేశంలో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని పోలీసులు ప్రజలకు సూచించారు.

# కాల్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణకు వ్యతిరేకంగా గ్రామస్తుల దీక్షకు బీజేపీ మద్దతు



**పరిగి, మార్చి 24 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాల్లాపూర్ గ్రామంలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు నిర్వహిస్తున్న దీక్షా కార్యక్రమానికి బీజేపీ నాయకులు ముకుంద నాగేశ్వర్ మద్దతు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ శాఖ తరపున టీజీఐఐసి ద్వారా భూమి సేకరణకు జిల్లా కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసంబద్ధంగా భూసేకరణ పేరుతో రైతుల జీవనాధారమైన భూములను లాక్కోవడం అన్యాయమని విమర్శించారు. గతంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన సుమారు 19 వేల ఎకరాల భూమి ప్రస్తుతం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా మారిందని, భూములు కోల్పోయిన రైతులకు సరైన ప్రయోజనం కలగలేదని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూనే గత కాంగ్రెస్ ప్రభుత్వంలోని మాజీ ప్రధాన మంత్రులు ఇందిరా గాంధీ, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన, అమలు చేసిన భూసంస్కరణల ద్వారా ఇతర పార్టీ ప్రభుత్వాల ద్వారా పేద రైతుల భవిష్యత్తుకు ఇచ్చిన భూమిని తెలంగాణ ప్రజలకు ఏ ఇండస్ట్రీలు అవసరమో, ఏవి స్థాపిస్తారో, వాటికి ఎంత భూమి అవసరమో, సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్ లేకుండా అసంబద్ధంగా భూసేకరణ పేరుతో భూమినే నమ్ముకుని బ్రతుకుతున్న పేద రైతుల దగ్గర్నుండి భూములను ఇప్పుడు ఇండస్ట్రియల్ కారిడార్ల పేరుతో ప్రభుత్వం వందల ఎకరాలను లాక్కోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇక వికారాబాద్ జిల్లాలోనే టీజీఐఐసి వద్ద ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఇప్పటికే 320 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నప్పటికీ, దానిని వినియోగించకుండా కొత్తగా కాల్లాపూర్, రాపోల్ గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల భూమి సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం సమంజసం కాదని అన్నారు. సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ లేకుండా ఏ పరిశ్రమలు స్థాపించబోతున్నారో స్పష్టత లేకుండానే భూసేకరణ చేపట్టడం పేద రైతుల భవిష్యత్తుకు ప్రమాదమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిజంగా రైతుల మేలు కోరితే వారి భూములపైనే చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సబ్సిడీలు, రుణాలు, నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సూచించారు. భవిష్యత్తు తరాల మేలును దృష్టిలో ఉంచుకొని ఈ భూసేకరణ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## లాల్ సింగ్ తాండ గ్రామపంచాయతీలో

# హెల్త్ క్యాంప్ నిర్వహించిన గ్రామ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్

**కుల్కచర్ల మండలం మార్చి 24 (ప్రజా జ్యోతి) :** కుల్కచర్ల మండల పరిధిలోని లాల్ సింగ్ తండా గ్రామపంచాయతీలో 99 రోజుల ప్రణాళికలు భాగంగా నేడు గ్రామపంచాయతీ కార్యాలయంలో 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది వారి ఆరోగ్య దృష్టి సారించాలని ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్ సూచించారు గ్రామంలో అందరికీ ఆరోగ్యంగా ఉండాలని మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్, కార్యదర్శి శారద ఆశ వర్కర్ అంజమ్మ తండా వాసులు గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.







# ప్రాథమిక పాఠశాల నుండి గురుకులంకు ఎంపికైన విద్యార్థులు

**కొడంగల్ మార్చ్ 24 ప్రజాజ్యోతి :** కొడంగల్ మండలము హుస్నేన్ పూర్ ప్రాథమిక పాఠశాల 2025 –26 సంవత్సరానికి కావలి అజయ్ కుమార్, కోట శివరాజ్ గురుకులంకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి అంజిలప్ప ప్రధానోపాధ్యాయులు ఇల్లూరి క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మమత విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# గౌడ సంక్షేమ సంఘానికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుంది

- గౌడ కులస్తులందరూ కలిసికట్టుగా ఉండి కులాభివృద్ధికి కృషి చేయాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- శంషాబాద్‌లో నిర్వహించిన గౌడ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- శంషాబాద్ మండలంలో నూతనంగా గెలుపొందిన గౌడ సర్పంచులు, వార్డు సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్






**రాజేంద్రనగర్, మార్చి 24 (ప్రజా జ్యోతి) :** గౌడ సంక్షేమ సంఘానికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ ఇచ్చారు. శంషాబాద్ మండల గౌడ సంఘం అధ్యక్షులు పంతంగి విఠలయ్య గౌడ్ అధ్యక్షతన మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని తొండపల్లిలో ఉన్న ఎమ్మెస్ కన్వెన్షన్‌లో నిర్వహించిన గౌడ సంక్షేమ సంఘం-శంషాబాద్ మండల గౌడ మహాసభకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల సర్పంచ్ ఎన్నికలలో శంషాబాద్ మండలంలో గెలుపొందిన గౌడ సర్పంచులు, వార్డు సభ్యులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌడ కులస్తులు అందరూ ఏకతాటిపై ఉండి కులాభివృద్ధి కొరకు తోడ్పడాలన్నారు. గౌడ కులస్తుల కొరకు ప్రభుత్వం వైన్ షాపులను కేటాయించిన విషయం మనందరికీ తెలిసిందన్నారు. ప్రతి గ్రామంలోనూ ఈత వనాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. బీసీలందరూ కలిసికట్టుగా ఉండే తనను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన విషయాన్ని తాను ఎప్పటికీ మరువలేరన్నారు. అందులో గౌడ కులస్తులది కూడా కీలకమైన పాత్ర అన్నారు. సంఘానికి ఎలాంటి సాయంకారాలు అవసరం ఉన్న తాను ఎప్పటికీ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తన ఇంటికి వచ్చి ఎప్పుడైనా కలవచ్చు అన్నారు. ఇంటికి పోతే ఏమనుకుంటాడో అనే భావన వదిలేసి తనను కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండలంలోని ఆయా గ్రామాల గౌడ సంఘం అధ్యక్ష కార్యదర్శులు,పిఏసిఎస్ చైర్మెన్‌లు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు కుల సంఘం నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# షాపూర్ నగర్ మార్కెట్‌లో క్షయ వ్యాధి (టీబీ)పై అవగాహన సదస్సు



**కుత్బుల్లాపూర్ మార్చి 24 (ప్రజాజ్యోతి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, షాపూర్ నగర్ డివిజన్ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో మంగళవారం క్షయ వ్యాధి (టీబీ) నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిహెచ్ఎంసి డివిజన్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో, మల్లారెడ్డి నర్సింగ్ ఇన్స్టిట్యూషన్స్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ.. సమాజంలో క్షయ వ్యాధి పట్ల ప్రజలకు సరైన అవగాహన ఉండాలని, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. మల్లారెడ్డి నర్సింగ్ కాలేజీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, ఒక ప్రదర్శన (స్కిట్) ద్వారా క్షయ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాముఖ్యతను ప్రజలకు కళ్ళకు కట్టినట్లు వివరించారు. టీబీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని విద్యార్థులు వివరించారు. నర్సింగ్ విద్యార్థుల స్కిట్ మార్కెట్‌కు వచ్చిన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ఇంచార్జి డ్ర్ బాలసుబ్రమణ్యం, అరుణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ ముకుంద రావు, రవికుమార్, సాజిద్, సంజీవ షాబుద్దీన్, జుబేర్ విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగస్వామ్యులు కావాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్ బోయినపల్లి మండలం కొదురుపాక పీహెచ్ సీలో ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం
- పేషెంట్లకు పోషకాహార కిట్ల పంపిణీ
- ఉత్తమ వైద్య సేవలు అందించిన వైద్యులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేత

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి మార్చి -24 (ప్రజాజ్యోతి)

టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్రపంచ టీబీ నివారణ దినోత్సవాన్ని బోయినపల్లి మండలం కొదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సీ)లో మంగళవారం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా 15 మంది టీబీ బాధితులకు పోషకాహార కిట్లు, కోడిగుడ్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులు పంపిణీ చేశారు. అలాగే టీబీ రహిత గ్రామాలుగా ప్రకటించిన 20 గ్రామాల కార్యదర్శులు, వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు, ఉత్తమ సేవలు అందిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించి, శాలువాతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొబైల్ ఎక్స్ రే యంత్రం ద్వారా జిల్లాలోని 42 గ్రామాల్లో మొత్తం 100 రోజుల్లో చేయనున్న వ్యాధి నిర్ధారణ పరీక్షల ప్రోగ్రామ్ ను కలెక్టర్ ప్రారంభించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. టీబీ నివారణ దినోత్సవం



సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి జూన్ 12 వ తేదీ వరకు అన్ని శాఖలకు సంబంధించిన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో సేవలు అందిస్తున్నామని వివరించారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు సైతం వైద్య పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా జిల్లాలో టీబీ నిర్ధారణ ఆరోగ్య పరీక్షలు మొబైల్ వాహనం, ఎక్స్ రే యంత్రం ద్వారా ప్రణాళిక ప్రకారం చేస్తారని, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. మెరుగైన వైద్య సేవల కోసం జిల్లా, ఇతర ఆసుపత్రులకు తరలించి వైద్యం అందించాలని సూచించారు. టీబీ బాధితులకు ప్రతి నెలా రూ. వెయ్యి ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తున్నదని వెల్లడించారు. పేషెంట్లు కచ్చితంగా మందులు వాడుతూ.. పోషకాహారం తీసుకోవాలని సూచించారు.




జిల్లా వ్యాప్తంగా 360 మందికి పోషకాహార కిట్లు పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు.సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత, ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిత, డిప్యూటీ డీఎం హెచ్ ఓ నాగేంద్ర బాబు, వైద్యులు శంకర్, సత్యనారాయణ, ఆనంద్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రేణు ప్రియాంక, రాజు కుమార్, తహసీల్దార్ నారాయణ రెడ్డి, సర్పంచ్ కే మంజుల, ఎంపీఓ శ్రీధర్, టీబీ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందకుంట బ్రహ్మోత్సవాలకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌కు ఆహ్వానం

ఇల్లందకుంట, మార్చి 24(ప్రజాజ్యోతి): అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్



దేవస్థానం అధికారులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు, ఆలయ ధర్మకర్తలు కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను జ్ఞాపికతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల సందర్భంగా జమ్మికుంట మున్సిపాలిటీ తరఫున పరిశుభ్రత, త్రాగునీరు మరియు భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాల కోసం రాజకీయాలకు అతీతంగా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, దేవస్థానం ధర్మకర్తలు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## భీమన్నను దర్శించుకున్న ఉమ్మడి కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ.

వేములవాడ,మార్చి,24:ప్రజాజ్యోతి. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి




ఆలయాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా విజిలెన్స్ ఎస్పీ శ్రీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి

### కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో,మార్చి 24(ప్రజాజ్యోతి ) యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నద్ధం కావాలని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధం






చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.ఈ ఏడాది యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రణాళికపై జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది యాసంగి సీజన్ లో 2 లక్షల 73 వేల 550 ఎకరాల్లో వరి ధాన్యం సాగైందని తెలిపారు. 6 లక్షల 46వేల 320 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేస్తున్నామని, 3 లక్షల 67 వేలా 776 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అన్నారు.జిల్లాలో ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డిసిఎంఎస్, హాకా ద్వారా 322 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పౌరసరఫరాలు, కో-ఆపరేటివ్, డి ఆర్ డి ఓ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు ఇందుకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తార్పాలిన్, తేమయంత్రాలు, బరువుతూచే యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, డ్రైయర్లు, కాలిపర్స్ వంటి సదుపాయాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అన్నారు. పూర్తిగా పక్వానికి వచ్చిన ధాన్యం మాత్రమే కోసేలా రైతులకు, హార్వెస్టర్ల యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు ధాన్యం, రవాణా తదితర ఏర్పాట్లు నిబంధనల ప్రకారం జరగాలని ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, పౌరసరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్, డి.ఆర్.డి.ఓ శ్రీధర్, డి.సి.ఓ రామానుజాచార్య, డిఎమ్ఓ షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడ అభివృద్ధి.. 80 లక్షలతో షాదీఖానా నిర్మాణం: పుల్కం రాజు

### వేములవాడలో షాదీఖానా స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్.. సకల వసతులతో నిర్మాణం చేపడతామని వెల్లడి!

వేములవాడ,మార్చి,24:ప్రజాజ్యోతి. వేములవాడ పట్టణాభివృద్ధిలో భాగంగా ముస్లిం సోదరుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం షాదీఖానా నిర్మాణానికి 80 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అక్రమ్ మరియు ఇతర మత పెద్దలతో సమావేశమై వారి సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ మరియు సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అందులో భాగంగానే మైనార్టీల చిరకాల కోరిక అయిన షాదీఖానాకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అన్ని హంగులతో, సకల వసతులతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం



మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పట్టణ అభివృద్ధిలో అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (DE) వరుణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, 25వ వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ, ముస్లిం మైనార్టీ కమిటీ నాయకులు మరియు పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

## పాతర్లపల్లిలో గాలికుంటు టీకాల పంపిణీ

ఇల్లందకుంట, మార్చి 24 (ప్రజాజ్యోతి): మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం గ్రామ సర్పంచ్ బైరెడ్డి వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి



కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, పాడి రైతులు తమ పశువులకు ఈ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. పశువుల ఆరోగ్యం కాపాడటం ద్వారా రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతుల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 145కు పైగా పశువులకు ఉచితంగా టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ విజేందర్ రావు, జేవో రవీందర్, ఎల్ఎస్ఏలు కనకయ్య, ప్రేమ్ కుమార్, గోపాలమిత్రులు కోడం శ్రీనివాస్, నవీన్, చిరంజీవి, తిరుపతి, మహేందర్, సాయి తేజ తదితరులు, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఆరు సంవత్సరాలుగా గుంతల మయంగా ఇల్లందకుంట-పరకాల రహదారి

### బ్రహ్మోత్సవాల ముందు భక్తులకు ఇబ్బందులు... అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ఇల్లందకుంట, మార్చి 24 (ప్రజాజ్యోతి): ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించాల్సిన ప్రధాన రహదారి గత ఆరు సంవత్సరాలుగా గుంతల మయంగా మారి ప్రయాణికులకు నరక యాతనగా మారింది. ఇల్లందకుంట–పరకాల ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అంతటా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వాహనాలు నెమ్మదిగా కదలాల్సి వస్తోంది. కొన్నిచోట్ల రోడ్డు పూర్తిగా చెదిరిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమంగా మారుతోంది. గుంతలు నీటితో నిండిపోవడం వల్ల అవి కనిపించక వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికే పలువురు చిన్నపాటి ప్రమాదాలకు గురయ్యారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడానికి భయపడుతున్నారు. ఇదే సమయంలో మరో రెండు రోజుల్లో ప్రారంభమయ్యే శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు ఇల్లందకుంటకు రానున్నారు. ఈ రహదారి పరిస్థితి వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు



పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే ప్రధాన మార్గం ఇదే కావడంతో పరిస్థితి మరింత కీలకంగా మారింది. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొన్నిసార్లు తాత్కాలికంగా గుంతలు పూడ్చినా, కొన్ని రోజుల్లోనే మళ్లీ అదే పరిస్థితి వస్తోందని ప్రజలు అంటున్నారు. శాశ్వత పరిష్కారానికి ఎలాంటి ప్రణాళికలు కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి నాణ్యమైన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల ముందు అయినా కనీసం తాత్కాలికంగా రహదారి మరమ్మత్తులు చేపట్టి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గ్యాస్ గోదాంలో తనిఖీలు

కరీంనగర్ టౌన్,మార్చి 24 (ప్రజాజ్యోతి ) ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి గ్యాస్ సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్




చిత్రా మిశ్రా పేర్కొన్నారు. సీతారాంపూర్ లోని నిర్మల భారత్ గ్యాస్ ఏజెన్సీ గోదాములో మంగళవారం ఆకస్మిక చేశారు. గృహ వినియోగదారుల, వాణిజ్య పరమైన సిలిండర్ల బుకింగ్, స్టాక్ నిల్వలు, రోజు వారీ సరఫరా తదితర వివరాలు ఆరా తీశారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆస్పత్రులకు సరఫరా అవుతున్న సిలిండర్లు, వాణిజ్యప్రమైన, గృహ అవసరాల సిలిండర్ల సరఫరా వివరాలు పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ సరఫరా చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. స్టాక్ నిలువలు, బుకింగ్ సంఖ్య తదితర వివరాలను ఎప్పటికప్పుడు పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి తెలియజేయాలని డీలర్లకు సూచించారు.

కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు ఉన్నారు.

## కరీంనగర్ అభివృద్ధే లక్ష్యం

### మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ బ్యూరో,మార్చి 24 (ప్రజాజ్యోతి ) కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం పాలకవర్గం ప్రధాన లక్ష్యమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పలు డివిజన్లలో పర్యటించారు.మొదటగా 44వ డివిజన్ సప్తగిరి కాలనీలోని కస్తూరిభా గాంధీ ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ చాడగొండ కవిత బుచ్చిరెడ్డితో కలిసి రూ.38 లక్షల నాబార్డ్ నిధులతో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.అనంతరం 49వ డివిజన్ సంతోష్ నగర్‌లో కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్‌తో కలిసి సంతోషిమాత దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి కాలనీలో రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించి, రోడ్డు సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తదుపరి భాగ్యనగర్ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షలతో త్రాగునీటి పైపులైన్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పాలకవర్గం పనిచేస్తుందని అన్నారు. శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల డివిజన్లకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నగరంలోని 66 డివిజన్లలో ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్



కింద ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునికీకరణ పనులు చేపట్టి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించామని, స్మార్ట్ ఈ-క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సప్తగిరి ప్రభుత్వ పాఠశాలలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.కార్యక్రమాల్లో కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, కర్రె పద్మ అనిల్, గాజ రమ శివరాం, డీఈ శ్రీనివాస్, ఏఈలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి:

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

### మాతా-శిశు సంరక్షణ కేంద్రం పనితీరుపై సమీక్ష

పెద్దపల్లి, మార్చి 24( ప్రజాజ్యోతి ) గర్భిణీ మహిళలకు ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మాతా-శిశు సంరక్షణ కేంద్రం (ఎంసిహెచ్) పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణీల వివరాలను తప్పనిసరిగా ఈడీబీ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. 102 అమ్మ ఒడి వాహనాల ద్వారా గర్భిణీలను ఆసుపత్రులకు తరలించి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ఫిబ్రవరి నెలలో ఎంసిహెచ్‌లో 182 ప్రసవాలు జరిగినట్లు వెల్లడిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని అన్నారు. ఆశా కార్యకర్తలు అందించే సమాచారాన్ని సూపర్వైజర్లు ధృవీకరించాలని, 102 సేవలను సమర్థంగా అమలు చేయాలని

ఆదేశించారు. ప్రసవం అనంతరం తల్లి, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, టీకాల కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని సూచించారు.మంథని ఎంసిహెచ్ పనితీరు మెరుగుపడిందని పేర్కొంటూ, మరింత మెరుగైన సేవల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బంది సమయ పాలన పాటించడంతో పాటు ఓపి సేవలను టోకెన్ విధానంలో అందించాలని అన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.ఆసు



పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులు మరియు సహాయకులకు తగిన సీటింగ్ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. రోగులను తిరస్కరించకుండా వైద్య సేవలు అందించాలని, సెక్యూరిటీ, నర్సింగ్ సిబ్బంది ప్రవర్తన మెరుగుపరచాలని సూచించారు. టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మాధక ద్రవ్యాల మహమ్మారి నివారణ ప్రతిఒక్కరి బాధ్యత

– ఈగల్ ఫోర్స్ స్పెషల్ డీఎస్పీ నర్సింగ రావు





**కారేపల్లి,మార్చి 24, ప్రజా జ్యోతి :** దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సింది నేటితరం విద్యార్థులని,వారిని మాదకద్రవ్యాల మహమ్మారి నుండి కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని తెలంగాణా ఈగల్ ఫోర్స్ టీమ్ స్పెషల్ డీఎస్పీ కే.నర్సింగ రావు అన్నారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా సింగరేణి మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డ్రగ్స్ నివారణపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,విద్యార్థులు తమ శక్తిని క్రీడలు,విద్య ఇతర నిర్మాణాత్మక ఆరోగ్యకరమైన దేశ భవిష్యత్తు నిర్మాలన కొరకు ఉపయోగపడే కార్యక్రమాల వైపు మళ్లించుకోవాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీం(డ్రగ్ లా ఎన్ఫోర్స్మెంట్ కోసం ఎలైట్ యాక్షన్ (గ్రూప్ టీమ్) సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే భయపడకుండా 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని వారన్నారు. డ్రగ్స్ వ్యాపారంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని,యువత భవిష్యత్తును కాపాడటమే పోలీస్ శాఖ,ఈగల్ టీమ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.అనంతరం పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ నూనావత్ సాగర్,ఎక్సైజ్ సీఐ ప్రశాంతి,తాసీల్దార్ ఎ. రమేష్,ఎంపీడీఓ పి. శ్రీనివారావు,ఎంఈఓ డి. జయరాజు,ఎస్ఐ బి.గోపి,కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ, విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ చిత్రపటానికి చింతకాని బీజేపీ నాయకులు పాలాభిషేకం



**చింతకాని మర్చి 24ప్రజా జ్యోతి** దేశ చరిత్రలో నరేంద్ర మోడీ గారు ప్రభుత్వ అధినేతగా ఎక్కువ కాలం పని చేసిన నాయకుడిగా చరిత్ర సృష్టించిన సందర్భంగా ఈరోజు చింతకాని బిజెపి మండల అధ్యక్షులు కొండా గోపి గారి ఆధ్వర్యంలో మోడీ గారి చిత్రపటానికి ముస్లిం జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ సిద్దుమియా గారి చేతుల మీదుగా పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేయడం జరిగింది . తదుపరి కొండా గోపి,నాయకులు మాట్లాడుతూ సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చంబ్లీ 8,930 రోజులు పదవిలో ఉండగా, ఆ రికార్డును మోడీ గారు బ్రేక్ చేశారు మోడీ గారు ఈరోజుతో 8,931 రోజులు పదవి బాధ్యతలు దాటి విజయవంతంగా కొనసాగిస్తూ రికార్డ్ బ్రేక్ చేశారు. ప్రభుత్వ అధినేతగా 25వ ఏటలో అడుగు పెట్టారు మోడి గారు,2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యత స్వీకరించిన మోడీ గారు, నాటి నుంచి నిరంతరం నాయకత్వం వహిస్తూ పదవిలో ఉన్నారు. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టి కాంగ్రెస్ తర పార్టీ నుంచి లోక్ సభలో పూర్తి మెజారిటీ సాధించిన తొలినేతగా మరియు 3వసారి అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెస్ తర ప్రధానిగా నిలిచారు. అత్యధిక కాలం ప్రభుత్వ అధినేతగా రికార్డు నెలకొల్పిన మోడీ గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ దేశం,ధర్మమే తన ధ్యేయంగా దేశ ప్రజలే కుటుంబ సభ్యులుగా భావించి భారతదేశాన్ని కంటికి రెప్పల కాపాడుతున్న మోడీ గారికి ఆ భగవంతుని శక్తి సామర్థ్యాలను ప్రసాదించాలని చింతకాని బిజెపి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు ఇమ్మడి సత్యనారాయణ,గోదా ఉపాధ్యక్షులు బక్క సత్యమూర్తి,కొండా వెంకన్న, సీనియర్ నాయకులు కోరిపల్లి శ్రీను, కోట సికిందర్, బుర్ర శ్రీను, తాటికొండ రామకృష్ణ, యువమోర్చా అధ్యక్షులు సత్తెనపల్లి గోపి,బూత్ అధ్యక్షులు అంజనా సిద్ధార్థ, గోపాలరావు, నాగయ్య, వలనుకొండ నరసింహారావు, పామర్తి శ్రీను, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత జిల్లా సాధన లక్ష్యంగా చర్యలు

– జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి – 94 గ్రామాలలో వంద రోజుల పాటు ప్రత్యేక టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం
– ప్రపంచ టీబి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ంటీబీ రహిత జిల్లాగా ఖమ్మంను తయారు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.మంగళవారం ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా స్థానిక బాలాజీ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 100 రోజుల వ్యవధిలో హై రిస్క్ ఉన్న 94 గ్రామాలలో టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టి అనుమానితులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షల ద్వారా టీబీ వ్యాధి నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు.టీవీ వ్యాధి నిర్ధారణ జరిగిన ప్రతి ఒక్కరికి వెంటనే చికిత్స ప్రారంభిస్తామని తెలిపారు. టీబీ ని గుర్తించి, చికిత్స అందించాలని అన్నారు. జాతీయ టీబీ కార్యక్రమం క్రింద గతంలో అనేక స్క్రీనింగ్ కార్యక్రమాలను జిల్లాలో అమలు చేశామని అన్నారు.ప్రస్తుతం జరిగే స్క్రీనింగ్ మరింత మెరుగ్గా జరగాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఈ స్క్రీనింగ్ కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ,కార్పోరేషన్,పంచాయతీ పాలక వర్గాలు భాగస్వామ్యం కావాలని అన్నారు. పోలియో తరహాలో టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం విస్తృతంగా జరగాలని అన్నారు.94 గ్రామాలలో 14 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి టీబీ స్క్రీనింగ్ నిర్వహించాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో వచ్చే టీబీ కేసులను ఏఐ ద్వారా విశ్లేషించి 94 హైరిస్క్ గ్రామాలను ఎంపిక చేసుకోవడం జరిగిందని అన్నారు. ఈ గ్రామాలలో స్క్రీనింగ్ విజయవంతం చేయడం ద్వారా టీబీని నిరోధించవచ్చని అన్నారు.టీబీ రహిత ఖమ్మం జిల్లా సాధన లక్ష్యంగా మనమంతా కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం ఇంటింటికీ చేయాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ స్క్రీనింగ్ పర్యవేక్షణకు నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. టీబీ వ్యాధిపట్ల ఎటువంటి భయాందోళనలు ఉండాల్సిన అవసరం లేదని, దీనిని మనం నివారించవచ్చని, వ్యాధి వ్యాప్తి చెందినప్పటికి సరైన చికిత్సతో నయం చేసుకోవచ్చని అన్నారు.టీబీ వ్యాధి వ్యాప్తి చెందితే వెంటనే చికిత్స అందించాలని, బయటకు చెప్పకుండా ఆలస్యం చేస్తే పరిస్థితి ఆందోళనకర పరిస్థితికి చేరుకుంటుందని అన్నారు. పోలియో తరహాలో టీబీ ని దేశం నుంచి తరిమికొట్టాలని అన్నారు.టీబి నిరోధకంలో ఖమ్మం జిల్లాను ప్రథమ స్థాయిలో ఉంచిన వైద్యారోగ్య శాఖ సిబ్బందికి కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ టీబీ వ్యాధికి ప్రస్తుతం భయపడాల్సిన అవసరం లేదని, టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. టిబి చికిత్సకు సంబంధించిన మందులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, వైద్యుల సూచనల మేరకు మందుల కోర్సు పూర్తి స్థాయిలో తప్పనిసరిగా వాడాలని అన్నారు.టీబీ రహితంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారని, దీని సాధన కోసం అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, వైద్యులు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని చెప్పారు.కార్యక్రమంలో డ్రగ్స్ అసోసియేషన్ వారు అందించిన నిక్షయ మిత్ర న్యూట్రీషన్ కిట్లను రోగులకు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.రామారావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.వేణుమాధవ్,జిల్లా టిబి నియంత్రణ అధికారి డా.సుబ్బారావు,వైద్యాధికారులు ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడాలి

– జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
– సిడిపిఓలు అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలి
– ఆర్బిఎస్కె వైద్యుల ద్వారా సామ్, మ్యామ్ పిల్లలకు వైద్య పరీక్షల నిర్వహణ
– అంగన్వాడీల పని తీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** అంగన్వాడీ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగన్వాడీల పని తీరుపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి కేవలం 36 శాతం మంది పిల్లలు మాత్రమే 21 రోజుల కంటే ఎక్కువగా వస్తున్నారని, అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం, మంచి పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నప్పటికీ పిల్లలు రాకపోవడానికి గల కారణాలను గమనించాలని అన్నారు.అంగన్వాడి కేంద్రాలలో పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు గమనిస్తూ లోపం ఉంటే వెంటనే అవసరమైన పోషకాలు అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఈ అంశాన్ని తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సిడిపిఓలు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ ప్రజలలో విశ్వాసం కల్పించి, అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలు రెగ్యులర్ గా వచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలు, పిల్లల హాజరు చాలా కీలకమని అన్నారు.అంగన్వాడి కేంద్రాలలో రిజిస్టరైన పిల్లలు కనీసం 85 శాతం కంటే ఎక్కువ హాజరు కావాలని కలెక్టర్ సి.డి.పి.ఓ., అంగన్వాడీ టీచర్లను ఆదేశించారు.గర్భిణీ స్త్రీలు,పిల్లలు, బాలింతలు అంగన్వాడి కేంద్రాలకు వచ్చే హాజరు శాతం ఖమ్మం అర్బన్, మధిర మండలంలో చాలా తక్కువగా ఉందని అన్నారు. నిర్లక్ష్యం ఎట్టి పరిస్థితుల్లో సహించమని, భవిష్యత్తులో ఇంప్రూవ్ కాకపోతే చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రతి సూపర్ వైజర్ తమ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను రెగ్యులర్ తనిఖీ చేస్తూ పని తీరు ఇంప్రూవ్ అయ్యేలా చూడాలని అన్నారు. ఏప్రిల్ నెలలో ఇంప్రూవ్ మెంట్ లేని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.మధిర ప్రాంతంలో గర్భిణీ మహిళలు, బాలింతలతో సమావేశం నిర్వహించి వారికి అవసరమైన వసతులు అంగన్వాడీ కేంద్రంలో అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సిడిపిఓ మండల పరిధిలో ఎన్ని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారో రిపోర్ట్ తయారు చేయాలని, ప్రతి నెలా కనీసం 15 రోజులు ఫీల్డ్ విజిట్స్ చేయాలని కలెక్టర్ అన్నారు.పిల్లల ఎదుగుదల రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తూ సామ్, మ్యామ్ పిల్లలను గుర్తించి వారికి అవసరమైన పోషకాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు ఆర్.బీ.ఎస్.కే. వైద్యులు పంపుతున్నామని, పిల్లలకు అవసరమైన వైద్య పరీక్షలు వైద్యులు నిర్వహించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.ఆర్.బి.ఎస్.కే. వైద్య బృందాలు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసే ముందే సమాచారం అందిస్తే సామ్, మ్యామ్ పిల్లలను వైద్య పరీక్షలకు అందుబాటులో పెడతారని, అంగన్వాడీ కేంద్రాలలో ఆర్.బీ.ఎస్.కే. వైద్యుల బృందం కనీసం రెండు గంటల సమయం గడపాలని కలెక్టర్ సూచించారు.రాబోయే నెల రోజుల వ్యవధిలో కనీసం 500 మంది పిల్లలు సామ్, మ్యామ్ నుంచి బయట పడేయడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో పిల్లలందరికీ ఆభా, ఆధార్, అపార్ కార్డు 100 శాతం జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో మెనూ తప్పకుండా పాటించేలా చూడాలని, పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు రెగ్యులర్ గా కోడి గుడ్లు పంపిణీ చేయాలని అన్నారు.సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన మేర టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, త్రాగునీటి సరఫరా వంటి పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి ప్రదీప్ బాబు, సిడిపిఓలు, అంగన్వాడీ టీచర్లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖమ్మం కోర్టులో

# ఫైన్ చెల్లించిన బీఆర్ఎస్ నేతలు



**ఖమ్మం..మార్చ్ 24 ప్రజా జ్యోతి టౌన్ ప్రతినిధి** మాజీ ముఖ్యమంత్రి వర్యులు, తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అక్రమ నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని కక్షసాధింపు చర్యలు చేస్తున్న కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరంకుశ వైఖరిని ఖండిస్తూ రాష్ట్ర పార్టీ మరియు మాజి మంత్రవర్యులు పువ్వాడ అజయ్ కుమార్ పిలుపు మేరకు ఖమ్మంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఖమ్మం నగర దీ=హా పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు మరియు వెంకట్ ఉపేందర్ ని అన్యాయంగా అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం జరిగింది.ఇదే ఖీ×= లో కిరణ్, అశోక్, ఈశ్వర్ పేర్లు కూడా చేర్చడం జరిగింది. ఇది సరిపోక షకీనా, వీరేందర్, సత్తార్ మియా, నగేష్, మాధవి, అల్లకుంట రవి, దుర్గాప్రసాద్ లపై కూడా అక్రమ కేసులు నమోదు చేయడం జరిగింది.ఈ రోజు ఖమ్మం కోర్టులో హాజరై ఫైన్ చెల్లించడం జరిగింది.ఈ నిరంకుశ ప్రభుత్వానికి భయపడేది లేదు. మా పోరాటం ఆగేది లేదు. పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తూ, ఇచ్చిన హామీలు ప్రజలకు చేరేవరకు మిమ్మల్ని ఎండగడుతూ ప్రజాక్షేత్రంలో నిలదీస్తూనే ఉంటాం.

రైతులు పండించిన పంటను

# ప్రభుత్వం కొనుగోలు చేయాలి: సీపీఎం"

– నకిలీ విత్తనాల సంస్థలపై పిడి యాక్టు నమోదు చేయాలి"
– ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి: శీలం సత్యనారాయణరెడ్డి(సీపీఎం డివిజన్ కార్యదర్శి)
– దళారుల దగా నుండి రైతన్నలను కాపాడాలి"



**వేంసూరు, మార్చి24( ప్రజాజ్యోతి)న్యూస్:** రైతులు పండించిన దాళ్వా వరి పంటను,మొక్కజొన్న,పత్తి తదితర పంటలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని,ధాన్యం కొనుగోలు కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల కేంద్రంలోని ఎర్రా రామయ్య భవనంలో మోరంపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శీలం మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల చేస్తున్న ప్రకటనలను అలుసుగా తీసుకొని దళారులు రైతులను దగా చేసి క్వింటాకు సుమారుగా 350 రూపాయల చొప్పున తగ్గించి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి యత్నిస్తున్నారని దీంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయే దుస్థితి ఏర్పడిందని వారి దగా నుండి రైతన్నలను ప్రభుత్వం కాపాడాలని ఆవేదన వ్యక్తం చేశారు.అంతే కాకుండా సత్తుపల్లి మండల పరిధిలోని సిద్దారశీ, గౌరీగూడెం, సదాశివునిపాలెం, వేంసూరు మండల పరిధిలోని లింగపాలెం తదితర గ్రామాల్లో రైతులకు నకిలీ వరి విత్తనాలు అమ్మి మోసం చేసిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని,విత్తన తయారీ సంస్థలపై పీడీ యాక్టు నమోదు చేసి నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇప్పించాలని కోరారు.లేకుంటే రైతాంగాన్ని రాజకీయాలకతీతంగా సమీకరించి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో: మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు,సీనియర్ నాయకులు అర్వపల్లి గోపాలరావు,కొత్తా సత్యనారాయణ,మల్లూరు చంద్రశేఖర్,అర్వపల్లి వెంకటేశ్వరరావు, గడిపర్తి మోహన్ రావు,చీపి రామకృష్ణ,పుచ్చకాయల వెంకటేశ్వరరావు,కావూరి సుదర్శనం,ఐద్వా నాయకురాలు శీలం కరుణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల కోసం,పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో సముచిత గౌరవం, పదవులు లభిస్తాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు నూతి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలో కాంగ్రెస్ పార్టీ సిటీ మైనారిటీ అధ్యక్షులు అబ్బాస్ బేక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీలో క్రమశిక్షణతో ఉంటూ,ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే నాయకులకు,కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. మైనారిటీల పాత్ర: కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో మైనారిటీ సోదరుల పాత్ర చిరస్మరణీయమని,సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.కార్యకర్తలే పునాది:సామాన్య కార్యకర్త కూడా ఉన్నత పదవులను అధిరోహించే అవకాశం ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని ఆయన కొనియాడారు.నగర మైనారిటీ అధ్యక్షులు అబ్బాస్ బేక్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నూతి సత్యనారాయణను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముస్తఫా మహమ్మద్ ముక్కరం మహమ్మద్ ఆవేజ్ ఖాద్రి,మాధవరావు, అనిల్,సయ్యద్, మహమ్మద్ సయ్యద్, ఫరేఖదిరి,, సాహెబ్ జకీర్ షేక్ రియాజ్,షేక్ రసీం,మహమ్మద్ జమీల్, అఖిల్,,సోహెల్,మహమ్మద్ జానీ, సయ్యద్ గౌస్ సేవాదళ్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# గట్ల చిన్న కోటిరెడ్డి జ్ఞాపకార్థంగా చలివేంద్రం



**పినపాక,మార్చి 24(ప్రజాజ్యోతి):** పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం గ్రామపంచాయతీ పరిధిలోని సినిమా హాల్ సెంటర్లో గట్ల చిన్న కోటిరెడ్డి గారి జ్ఞాపకార్థంగా చలివేంద్రం (చలివాన్) ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఆయన కుమారుడు గట్ల బాలకోటిరెడ్డి, గట్ల బాలిరెడ్డి కలిసి గత పది సంవత్సరాలుగా ప్రతి వేసవిలో నిర్వహిస్తూ సేవా భావాన్ని చాటుతున్నారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి సంవత్సరం మూడు నెలల పాటు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, గ్రామస్తులకు మరియు




ప్రయాణికులకు తాగునీరు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో స్థానికులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, గట్ల కుటుంబం చేస్తున్న సేవను ప్రశంసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏడుళ్ల బయ్యారం గ్రామ పెద్దలు, గ్రామస్తులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొని గట్ల చిన్న కోటిరెడ్డి గారిని స్మరించుకున్నారు.

## ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణం

### ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ కో కన్వీనర్ పృథ్వీరాజ్ నాయక్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 24(ప్రజాజ్యోతి): ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో షష్టి తిథి మంగళవారం సందర్భంగా టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ కో కన్వీనర్ జె.పృథ్వీరాజ్ నాయక్, జె.కృష్ణం రాజ్ నాయక్ ఆధ్వర్యంలో జె.బిచ్చునాయక్, సుభద్ర దంపతులు శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.ఈ కళ్యాణ వేడుకలలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు.దైవచింతనతో మానసిక



ప్రశాంతత లభిస్తుందని తెలిపారు.తమ పార్టీ నాయకులు జె.పృథ్వీ రాజ్ నాయక్ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణంను వైభవంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు.కర్ణాటక రాష్ట్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారని తెలిపారు.సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్,కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, భూక్య జ్యోతి,కొణతం రాజేష్ రెడ్డి,రాజ్ నాయక్ తండా గ్రామ సర్పంచ్ లూనావత్ శాంతాబాయ్ పాండు నాయక్, పీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ చింతమల్ల రమేష్,మాజీ కౌన్సిలర్ జాటోతు లక్ష్మి, నాలుగో వార్డ్ పార్టీ ఇంచార్జ్ వాజిత్ మియా, వినోద్ నాయక్, దేవాలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెలిదే శ్రీనివాస్, ఏలుగూరి రాంబాబు గౌడ్, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి గురుస్వామి, మానసాని రామ్మూర్తి,బిక్కుమల్ల కృష్ణ, దేవాలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ శర్మ తంత్రీ, వెంకటేశ్వర శర్మ, శంకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

మొదటిపేజీ తరువాయి..

దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు.

## చిన్న జీయర్ స్వామిని కలిసి ఆశీస్సులు అందుకున్న ఎం ఎల్ ఎ వెడ్మ బొజ్జు పటేల్

### అల్లంపల్లి జియర్ గురుకుల అభివృద్ధికి పాటుపడతా నని హామీ

### సంతోషం వ్యక్తం చేసిన ఆధ్యాత్మిక గురువు చిన్న జీయర్ స్వామి

ఖానాపూర్ మార్చి 24 (ప్రజా జ్యోతి ) ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామిని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ



అధ్యక్షులుఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ మంగళవారం హైదరాబాద్ భాగ్యనగరం ముచింతల్లోని శ్రీ రామ నగర్లో గల స్వామిని ప్రత్యేకంగా దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు హైదరాబాద్‌లోని స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ వద్ద ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, జ్ఞాన మార్గానికి మార్గదర్శకులైన శ్రీ చిన్న జీయర్ స్వామి ని నిర్మల్ ఎమ్మెల్యే తోపాటు జేరె అధి నారాయణ మరో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా స్వామిజీ అల్లంపల్లి ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచిస్తూ, ముఖ్యంగా రోడ్ల సౌకర్యం మెరుగుపర్చడం ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అల్లంపల్లి అభివృద్ధిని వేగవంతం చేయడానికి కట్టుబడి ఉన్నామని, అవసరమైన చర్యలు త్వరితగతిన చేపడతామని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

**30ఏళ్ళ క్రితం నుంచేఖానాపూర్ నియోజకవర్గం లొని అల్లంపల్లి అడవుల్లో ఆధ్యాత్మిక విద్య కుసుమాలను తయారు చేస్తున్న చిన్న జీయర్**

బిర్సాయిపేట అల్లం పెల్లి ప్రాంతాల్లో 30ఏళ్ళ క్రితం నుంచే ఆదివాసి అడవి బిడ్డలు గిరిజనులకు ఆధ్యాత్మిక చింతన తో పాటు విద్య కుసుమాలుగా తయారుచేసి సమాజంలో నిలిపిన శిల్పి ఆధ్యాత్మిక గురువు చిన్న జీయర్ స్వామికి ఖానాపూర్ నియోజక వర్గానికి అత్యంత సాన్నిత్యం ఉంది మూడు దశాబ్దాల క్రితం దట్టమైన అడవుల్లో అన్నల( నక్సలైట్ల స్థావరాలుగా ) ప్రాంతంగా పేరంది దేశంలోనే మొట్టమొదటి ఎన్కౌంటర్ ఎదురుకార్పులు పోలీసులకు నక్సలైట్లకు (అన్నలకు ) జరిగిన ఈ అల్లం పెల్లి ప్రాంతంలో ఆధ్యాత్మికంగా గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసి నేటికీ వేలాది మందికి విద్యనభ్యసింపా చేసిన ఘనత ఆధ్యాత్మిక గురువు చిన్న జీయర్ స్వామికి దక్కడం గమనార్హం మూడు దశాబ్దాల క్రితం దట్టమైన చిట్టడవిలో ఎలాంటి రహదారి సౌకర్యాలు లేకపోయినా తన తలచిందే తనవుగా అడవుల్లో ఆధ్యాత్మిక చింతను కల్పిస్తామని ఒక సందర్భంలో సంకల్పించిన స్వామి ఈ ప్రాంతం తో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోని పలు జిల్లాలకు చెందిన గిరిజనఅడవి ప్రాంతాల్లో కొన్ని గురుకులం పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యను పెంపొందించారు గురువులంటే కేవలం భక్తి జ్ఞాన వైరాగ్యాలు కాకుండా ఉన్నత స్థాయి విద్యను కల్పించడం చిన్న జీయర్ స్వామి నైజానికి చిహ్నంగా బీర్సాయిపేట అల్లంపల్లి లు నిలుస్తాయి

**అల్లంపెల్లిగ్రామానికి గురుకులానికి రహదారి సౌకర్యం కల్పిస్తా ఎమ్మెల్యే బొజ్జో పటేల్**

తన నియోజకవర్గం లో ఆధ్యాత్మిక భావనతో పాటు విద్య కుసుమాలను గిరిజన ఆదివాసులకు అందిస్తున్న చిన్న జీయర్ స్వామి గురుకులం తో పాటుఅల్లం పల్లి గ్రామానికి ఎన్ని ఆటంకాలు ఉన్న కేంద్ర రాష్ట్ర



ప్రభుత్వాలతో పాటు అటవీశాఖ అధికారులను ఒప్పించ దానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం తీసుకొని పూర్తిస్థాయి రహదారి సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. దట్టమైన అడవులు గల జిల్లాలో గత మూడు దశాబ్దాల క్రితం పాఠశాలలు నెలకొల్పడం చిన్నజీర స్వామి సంకల్పానికి దాసోహం పలుకుతున్నానని కేవలం గురు బోధనలు భక్తి భావనే కాకుండా విద్యాలయాలు నెలకొల్పడం. మహానగరం హైదరాబాద్ భాగ్యనగరంలో ఆధ్యాత్మికంగా రామానుజుల స్టాచు విగ్రహం ఏర్పాటు తోపాటు 108 దివ్య సాకేత ఆలయాలు నిర్మించడం, వివిధ రకాల ఆయుర్వేద వైద్య కళాశాలతో పాటు అంగ వికలాంగుల,అందులకు విద్యను అందజేయడం జీయర్ స్వామి సేవకు దర్పణం అని కొనియాడారు ఖానాపూర్ తన నియోజకవర్గం లోని జీయర్ గురుకులాలకు తప్పకుండా రహదారి సౌకర్యాలు తో పాటు ఇతరత్రా సదుపాయాలు ఏర్పాటు చేస్తామని ఖానాపూర్ ఎం ఎల్ ఏ బొజ్జు పటేల్" ప్రజా జ్యోతి" తో అన్నారు.

## హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

### అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు

### ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం కానున్న కమిటీ

హైదరాబాద్, మార్చి 24(ప్రజాజ్యోతి): హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో ఈ రోజు రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ – స్టేట్ మీడియా అక్రిడిటేషన్





కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార–పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో–చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచార–పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

## కారుణ్యమరణంతో హరీష్ రాణా మృతి

మొదటిపేజీ తరువాయి..

తెలిసిందే. అతడికి చికిత్స నిలిపివేయొచ్చని న్యాయస్థానం పేర్కొంది. దీంతో ఎయిమ్స్ వైద్యులు అతడికి క్రమంగా చికిత్స నిలిపివేశారు. ఈ క్రమంలోనే అతడు మంగళవారం తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. 13 ఏళ్లుగా కోమాలో ఉండి, జీవచ్ఛవంలా మంచానికే పరిమితమైన 32 ఏళ్ల హరీశ్ రాణాకు కారుణ్య మరణానికి(పాసివ్ యూతనేషియా) అనుమతిస్తూ సుప్రీంకోర్టు మార్చి 11న చారిత్రాత్మక తీర్పునిచ్చిన సంగతి విదితమే. న్యాయస్థానం ఆదేశాల మేరకు వైద్యం నిలివేసిన వైద్యులు.. క్రమంగా అతడి ఆరోగ్యం క్షీణింపజేసి, మరణించేలా చేశారు. ఈ విషయమై హరీశ్ రాణా తండ్రి అశోక్ రాణా స్పందిస్తూ.. 'మేం దీనికోసమే పోరాడుతున్నాం. ఏ తల్లిదండ్రులు తమ కొడుకుకు ఈ రకంగా జరగాలని కోరుకోరు' అని కన్నీటిపర్యంతమయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన 32 ఏళ్ల హరీశ్ రాణా చండీగఢ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతుండేవాడు. అతడు 2013 ఆగస్టు 20న హాస్టల్లో ప్రమాదవశాత్తూ నాలుగో అంతస్తు బాల్కనీ నుంచి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. శరీరం కదల్లేని స్థితికి చేరుకుంది. ప్రముఖ ఆసుపత్రుల్లో చికిత్స అందించినా అతడి హెల్త్ కండీషన్‌లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. ప్రమాదానికి గురైన నాటి నుంచీ కోమాలోనే ఉండిపోయాడు. ఈ నేపథ్యంలో హరీశ్ తల్లిదండ్రులు 2024 జులైలో కుమారుడి కారుణ్య మరణానికి అనుమతించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. పలు కారణాలతో ఈ పిటిషన్‌ను కొట్టివేసింది.

## మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కే ప్రతిష్ట

మొదటిపేజీ తరువాయి..

**చిట్‌చాట్‌లో కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి**

మాట్లాడుతూ.. తనకు గతంలో హామినిచ్చిన అధిష్టానం ఇపుడు ఏం చేస్తుందో తెలియదన్నారు. నేను మంత్రి పదవి కోసం పాకులాడడం లేదు. ఏ పదవి లేకున్నా రాజగోపాల్ రెడ్డికి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందన్నారు. నాకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే నా లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమన్నారు. తనకు రేవంత్ రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని.. నిన్న ముఖ్యమంత్రితో ప్రత్యేక భేటీ లేదు, ఎదురుపడితే పలకరించుకున్నామని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ కేటీఆర్‌తో కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానన్నారు.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967